


ఆన్‌సె యాంగ్ చేతిలో
సింధు ఓటమి 08


తెలుగు దినపత్రిక

# ఇదే నిజం

వార్తలు

towards truth..

www.Idenijamdaily.com



## రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి 'ఇదే నిజం' ఆహ్వానం పలుకుతున్నది 'ఇదే నిజం' తెలుగు దిన పత్రికలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను.

**అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం**

**సెల్ : 9492652230**



| రంగారెడ్డి, మేడ్చల్ | సోమవారం | 26.10.2026 | సంపుటి : 1 | సంచిక :323 | పేజీలు : 8 | వెల : 4/- |
|---|---|---|---|---|---|---|
| RANGAREDDY, MEDCHAL | Monday | 26.10.2026 | volume : 1 | Issue : 323 | Pages : 8 | Cost : 4/- |




## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 142 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 169 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 262 (కిలో) |
| స్కిన్ లెస్ | 296 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹82

# మూడ్రోజులు వర్షాలు

### ఈనెల 28న భారీ నుంచి అతిభారీ వర్షాలకు చాన్స్

### ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్

### ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు!



హైదరాబాద్, అక్టోబర్ 25 : తూర్పు-మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం సోమవారం తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది క్రమంగా బలపడి ఈనెల 27న తీవ్ర తుపాను, 28వ తేదీ నాటికి అతి తీవ్ర తుపానుగా మారుతుందని హెచ్చరించింది. దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా ఉన్నప్పటికీ

-మిగతా 2 లో..



# సన్నబియ్యం సరఫరాలో అక్రమాలు

### సీఐడీ అదుపులో రైస్ మిల్లుల యజమానులు

హైదరాబాద్, అక్టోబర్ 25 : సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించి భారీగా అక్రమాలకు పాల్పడటంతో పాటు రైస్ మిల్లుల్లో భారీగా బియ్యం అక్రమ నిల్వలకు సంబంధించి రైస్ మిల్లర్లపై సీఐడీ పోలీసులు కొరడా ఝుళిపించారు. ములుగు జిల్లాకు చెందిన ఐదుగురు మిల్లర్లను అదుపులోకి

-మిగతా 2 లో..

# భారత్‌లో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలం

### అందిపుచ్చుకునేందుకు ప్రవాస భారతీయులు తరలిరావాలి

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు



న్యూఢిల్లీ, అక్టోబర్ 25 : భారత్‌లో ప్రతి రంగంలో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. వాటిని అందిపుచ్చుకునేందుకు ప్రవాస భారతీయులు తరలిరావాలని కోరారు. ఆదివారం

-మిగతా 2 లో



# రాహుల్‌గాంధీకి ఏటీఎంగా తెలంగాణ

### 420 హామీలిచ్చి ప్రజలకు ముఖం చాటేస్తున్నారు

- రేవంత్‌రెడ్డి పాలనలో వరుస స్కామ్‌లు
- ప్రశ్నిస్తే తిట్లు, అక్రమ కేసులతో బెదిరింపులు
- కాంగ్రెస్‌ను ఎదుర్కొనే దమ్ము బీజేపీకి లేదు
- రెండేండ్లలో కేసీఆర్ సీఎం కావడం పక్కా
- జిబ్రాన్ షరీఫ్ చేరిక కార్యక్రమంలో కేటీఆర్

> కేసీఆర్ పాలనలో తెరిపినపడ్డ తెలంగాణను కాంగ్రెస్ ముఖ్యమంత్రి, మంత్రులు లూటీలో పోటీపడుతూ తెర్లుచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఢిల్లీలోని రాహుల్‌గాంధీ తెలంగాణను ఏటీఎంలా మార్చుకున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని, ఇద్దరూ కలిసి అడ్డగోలుగా దోపిడీ చేస్తూ తెలంగాణ సంపదను కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ గడ్డపై నిలబడి 420 హామీలిచ్చిన రాహుల్‌గాంధీ పత్తాలేకుండా పోయారని దెప్పిపొడిచారు. దేశమంతా తిరుగుతున్న ఆయన కోసం నాడు అశోక్‌నగర్‌లో చాయ్ తాగించిన యువకులు ఎదురుచూస్తున్నారని, జాబ్ క్యాలెండర్ అమలు చేయని ఆయనకు ముఖం చెల్లడంలేదని చురకలంటించారు.

హైదరాబాద్, అక్టోబర్ 25 : రేవంత్ ప్రభుత్వం పంపుతున్న సొమ్ములు తీసుకుంటూ రాహుల్ మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. ఖైరతాబాద్‌కు చెందిన మైనారిటీ యువనేత జిబ్రాన్ షరీఫ్ ఆదివారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్‌లో చేరగా ఆయనకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి

-మిగతా 2 లో..

# సైబర్ దాడులతోనూ దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు

### 'సైబర్ ఉగ్రవాదుల' నుంచి 'బ్యాంకింగ్'ను రక్షించుకోవాలి

### ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరిక

### ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం

### భువనేశ్వర్‌లో ఆర్బీఐ డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణ సంస్థ ప్రారంభం



> ప్రస్తుతం యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే జరగడం లేదని, ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడి చేయడం ద్వారా కూడా దాన్ని బలహీనపరచవచ్చని మోదీ పేర్కొన్నారు. భారతదేశం ఆర్థికంగా ఎదుగుతున్న కొద్దీ, మన డిజిటల్ మౌలిక వసతులను, బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరగాళ్లు, సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని ప్రధాని చెప్పారు. పాతకాలపు పద్ధతులు, పాత శిక్షణా పరికరాలతో ఆధునిక సైబర్ ముప్పులను ఎదుర్కోలేమని, సమర్థవంతమైన మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవవనరులు అవసరమని స్పష్టం చేశారు.

భువనేశ్వర్, అక్టోబర్ 25 : ప్రపంచంలో యుద్ధాలు ఇకపై కేవలం సాంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా, ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కూడా జరుగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అందుకే మన దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ ను 'సైబర్ ఉగ్రవాదుల' నుండి రక్షించుకో వాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. ఆదివారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన రూ.169 కోట్ల విలువైన డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణ సంస్థను మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రసంగించారు. ఈ డేటా సెంటర్, శిక్షణ సంస్థ ఒడిశా ప్రజలకే కాకుండా దేశానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. సైబర్ ముప్పుల స్వభావం నానాటికీ మారుతోందని, పాత వ్యవస్థలు, పాత శిక్షణ పద్ధతులు, పాత పరికరాలతో దేశం ఇటువంటి కొత్త సవాళ్లను ఎదు- ర్కోలేదని తేల్చిచెప్పారు. ఇందుకోసం ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు

మిగతా 2 లో





# ఎల్‌నినోతో తీవ్ర కరువు

### పక్కా ప్రణాళికతో ప్రజలను కాపాడతాం

### సీఈసీ జ్ఞానేష్ రాజీనామా చేసే వరకు పోరాటం

### నవంబరు 1న ఢిల్లీలో 20 లక్షల మందితో భారీ నిరసన

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెం, అక్టోబర్ 25 : ఎల్‌నినో.. ప్రకృతి విపత్తు కారణంగా వచ్చింది కఠినమైన కరువని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా, శక్తియుక్తులతో ఎదుర్కొని ప్రజలను కాపాడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని తన క్యాంప్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్

-మిగతా 2 లో..

# 'చిల్లర' గొడవ..

### కదులుతున్న బస్సులోంచి కండక్టర్‌ను తోసేసిన మహిళ

### బస్సు వెనుక టైర్లు ఎక్కడంతో తీవ్రగాయాలు

### భద్రాద్రి జిల్లా మిట్టగూడెం వద్ద ఘటన

### ప్రయాణికురాలిపై కేసు నమోదు



అశ్వాపురం, అక్టోబర్ 25 : ప్రయాణికురాలితో చిల్లర కోసం జరిగిన గొడవ ఓ మహిళా కండక్టర్ ప్రాణాల మీదకు తెచ్చిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటు చేసుకుంది. మిట్టగూడెంకు చెందిన ఓ ప్రయాణికురాలు.. మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న మణుగూరు ఆర్టీసీ డిపోనకు చెందిన పల్లె వెలుగు బస్సు ఎక్కారు. ఆమెతో పాటు ఉన్న బాలుడికి టికెట్ తీసుకోవాలని మహిళా కండక్టర్ సూచించారు. అందుకు నిరాకరించిన ప్రయాణికురాలు.. కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం బాలుడికి టికెట్ తీసుకునేందుకు అంగీకరించిన ప్రయాణికురాలు కండక్టర్‌కు డబ్బులు ఇచ్చారు. టికెట్ ఇచ్చి దిగేటప్పుడు మిగిలిన చిల్లర తీసుకోవాలని కండక్టర్ చెప్పగా.. అలా కుదరదని,

-మిగతా 2 లో..



# 'మోదీ తండ్రి కూడా పోతారు

### సర్ ప్రక్రియలో అక్రమాలపై ఖర్గే వ్యాఖ్య..

### తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ నేతలు

పట్నా, అక్టోబర్ 25 : ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్య తీవ్ర దుమారం రేపింది. బిహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ 139వ జయంతిని పురస్కరించుకుని పట్నాలో

-మిగతా 2 లో..



# సైబర్ దాడులతోనూ దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

అవసరమని ఉద్ఘాటించారు. అందుకే డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణా సంస్థను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇవి మన కొత్త ప్రాధాన్యతను ప్రతిబింబిస్తున్నాయని తెలియజేశారు. 'వికసిత్ భారత్'కు తూర్పు భారతదేశం శక్తివంతమైన వృద్ధి చోదకంగా ఆవిర్భవిస్తోందని ప్రశంసించారు. భారతదేశ డిజిటల్ ఆర్థిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో, సాంకేతిక స్వయం సమృద్ధిని పెంపొందించడంలో డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణ సంస్థల ప్రాముఖ్యతను ప్రధానమంత్రి వివరించారు. ఆర్థికాభివృద్ధి ఫలాలను ప్రతి ప్రాంతానికి, ప్రతి పౌరుడికి చేరవేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మారుతున్న దృక్పథానికి ఈ డేటా సెంటర్ ఒక నిదర్శనమని ఆయన ఉద్ఘాటించారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌పై మోదీ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనలో సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందకుండా చేశారని ఆరోపించారు. పేదల పేరుతో బ్యాంకులను జాతీయం చేశారని, అయితే 2014 నాటికి దేశ జనాభాలో సగానికి పైగా ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్నారని చెప్పారు. 2014 తర్వాత ఈ పరిస్థితి మారిందని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చాక బ్యాంకింగ్ సేవలను సామాన్య ప్రజలకు సైతం అందుబాటులోకి తీసుకొచ్చామని స్పష్టంచేశారు. గతంలో ధనవంతులకే పరిమితమైన క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు నేడు అందరికీ అందుతున్నాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా, ఒడిశా గవర్నర్ బ్రజ్‌మోహన్ రామ్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటంలోనూ, నిరంతర ఆర్థిక వృద్ధికి తోడ్పడటంలోనూ పటిష్టమైన మౌలిక సదుపాయాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను ప్రస్తావించారు. కొత్త డేటా సెంటర్‌లో ఆర్బీఐ కీలకమైన వ్యవస్థలైన ఆర్‌టీజీఎస్, ఎన్‌ఈఎఫ్‌టీ వంటివి ఉంటాయని చెప్పారు. ఈ శిక్షణా సంస్థ సైబర్ సెక్యూరిటీ, ఏఐ, ఇతర సాంకేతికతలలో మానవ వనరుల నైపుణ్యాన్ని పెంపొందిస్తుందని స్పష్టంచేశారు.



# 'చిల్లర' గొడవ..

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడే చిల్లర ఇవ్వాలని ప్రయాణికురాలు వాగ్వాదానికి దిగారు. ఈలోగా మిట్టగూడెం స్టాప్ రాగానే ఆమె బస్సు దిగడానికి ప్రయత్నించారు. వాగ్వాదం నేపథ్యంలో మహిళా కండక్టర్ ఆమెను అదే బస్సులో అశ్వాపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లడానికి ప్రయత్నించారు. బస్సును ముందుకు నడపాలని డ్రైవర్‌కు సూచించారు. ఈ దశలో ఆ ప్రయాణికురాలు ఆమెను నెట్టివేయడంతో కదులుతున్న బస్సు వెనుక చక్రాల కింద పడిపోయారు. దీంతో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రయాణికురాలిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఎల్లయ్య తెలిపారు.

### కండక్టర్‌కు మెరుగైన వైద్యం అందించండి

మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళికపై జరిగిన దాడిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో మాట్లాడి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న కండక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదుచేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కండక్టర్ ప్రవళికకు మెరుగైన చికిత్స అందించాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. విధుల్లో ఉన్న సిబ్బందితో ప్రయాణికులు సహృదయంతో వ్యవహరించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి దాడులు చేయడం పద్ధతి కాదని స్పష్టం చేశారు. మహిళాకండక్టర్‌పై దాడిని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు ఈదురు వెంకన్న, థామస్‌రెడ్డి, కమల్‌రెడ్డి, నరేదందర్, హనుమంతు ముదిరాజ్, వీఎస్‌రావు తదితరులు తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సన్నబియ్యం సరఫరాలో అక్రమాలు..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బాదం, శ్రీమాత రైస్ మిల్స్ యజమాని బాదం ప్రవీణ్, లేపాక్షి రైస్‌మిల్ యజమాని మోహన్, సాయిరాం రైస్‌మిల్ యజమాని రఘోత్తమ్, వాసవి రైస్‌మిల్ యజమాని శ్రవణ్, ఎల్ఎస్ఆర్ రైస్‌మిల్ యజమాని హరినాథ్‌ను అదుపులోకి తీసుకొని వరంగల్‌లోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ ధాన్యాన్ని సొంతానికి వాడుకోవడంతో పాటు, బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోవడంతో అక్రమాలకు పాల్పడిన మిల్లర్లకు గతంలోనే నోటీసులు జారీ చేశారు. ఎఫ్‌సీఐకి సన్న బియ్యం బదులు దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు రావడంతో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కేటాయింపులపై సీఐడీ దర్యాప్తు చేపట్టింది. నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లో 16 రైస్ మిల్లుల యజమానులు 3,385.820 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు. బోనస్ రూపంలో ప్రభుత్వానికి సుమారు రూ.1.69 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. మరో 45,414.833 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్‌కు కేటాయించారు. ఈ కేటాయింపులపై బోనస్ పరంగా సుమారు రూ.242 కోట్ల మేర ప్రభుత్వంపై ఆర్థిక ప్రభావం ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మిల్లర్ల పాత్రతో పాటు అధికారుల ప్రమేయం, కుట్ర కోణంపై సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# రాహుల్‌గాంధీకి ఏటీఎంగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలు, ఎన్నికల హామీల ఎగవేత, కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక విధానాలపై వివరించారు. పింఛన్లను రెట్టింపు చేస్తామని, యువతులకు స్కూటీలు ఇస్తామని, రైతులకు ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని హామీలు గుప్పించిన కాంగ్రెస్, ఆచరణలో దారుణంగా విఫలమైందని విమర్శించారు. హామీల అమలు.. వరుస స్కామ్‌ల గురించి ప్రశ్నిస్తే రేవంత్‌రెడ్డి తిట్లు..అక్రమ కేసులతో బెదిరింపులకు దిగుతున్నాడని దుయ్యబట్టారు. ఆయనపెట్టే కేసులకు భయపడేది లేదని, బరాబర్ గల్లాపట్టి అడుగుతామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఎదుర్కొనే సత్తా బీజేపీకి లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రధాన ప్రతిక్షంగా ప్రజాసమస్యలపై కొట్లాడుతున్నది బీఆర్ఎస్సేనని స్పష్టంచేశారు. కరువుతో ప్రజలు అల్లాడుతుంటే రేవంత్‌రెడ్డి చిల్లరగా మాట్లాడి బీఆర్ఎస్‌పై నెపంనెట్టి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. నీళ్లు, కరెంట్ ఉన్నా ఇవ్వడం చేతగాకే పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కన్నెపల్లికి వెళ్లి నీళ్లను చూపిస్తే కేసీఆర్‌కు పేరొస్తుందనే ఎత్తకుండా ప్రజలను ఇబ్బందుల పాలుచేస్తున్నారని విమర్శించారు. నీళ్లు ఎత్తవచ్చని చెప్పిన పాపానికి రిటైర్డ్ ఇంజినీర్‌కు బెల్ట్‌ట్రీట్‌మెంట్ ఇస్తానని బెదిరించడం దుర్మార్గమని మండిపడ్డారు.

### బీజేపీవి విభజన రాజకీయాలు

ఓవైపు అభివృద్ధిని విస్మరించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య విభజనలు సృష్టిస్తుంటే, మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటున్నదని కేటీఆర్ మండిపడ్డారు. 'డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే ఒకటి హమ్లా..మరొకటి జుమ్లా' అని దెప్పి పొడిచారు. పాలకుల వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై ఈడీ, సీబీఐ, ఐటీ లాంటి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం..అరెస్టులతో భయపెట్టడం లాంటి ధోరణి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ఇలాంటి ప్రతీకార రాజకీయాలు చేయలేదని గుర్తుచేశారు. ప్రజాసమస్యలపై పోరాడుతూ తెలంగాణ ప్రయోజనాలను కాపాడే



శక్తిగా బీఆర్ఎస్ నిలుస్తుందని స్పష్టంచేశారు. బీజేపీ మతతత్వ రాజకీయాలను ఎదుర్కొనే దమ్ము దేశంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు లేదని స్పష్టంచేశారు. ఇతర పార్టీలే బీజేపీకి ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో వరుసగా వెలుగుచూస్తున్న కుంభకోణాలపై సీఎం రేవంత్‌రెడ్డి మౌనం వహించడం శోచనీయమని కేటీఆర్ వాపోయారు. ప్రశ్నించిన ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ఎదురుదాడికి దిగి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. 'ఫోర్త్‌సిటీలో సీఎం రేవంత్ సోదరుడికి సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయింపు.. అమెరికాలోని మరో తమ్ముడికి చెందిన కంపెనీతో రూ.1000 కోట్ల అగ్రిమెంట్.. ఆయన కూతు-రు..సతీమణిపై వస్తున్న ఆరోపణలపై స్పందించి రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. ఆధారాలు చూపినా మౌనం వహించడంలోని ఆంతర్యమేందని ప్రశ్నించారు. ఇప్పటికే నగరంలో బలంగా ఉన్న బీఆర్ఎస్‌కు మైనారిటీ యువనేత జిబ్రాన్ షరీఫ్ చేరికతో మరింత బలంపెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆయన గులాబీ పార్టీలోకి రావడం శుభసూచకమని వ్యాఖ్యానించారు. జిబ్రాన్ పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఆయనకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో తీవ్ర కరువు



(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. గడిచిన రెండేళ్లలో దేశంలోనే అత్యధికంగా పంటలు తెలంగాణలోనే పండాయన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది మొదటి పంట పూర్తయిందని.. రెండో పంటకు ఎల్‌నినో ప్రభావంతో నీటి కరువు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అందువల్ల ఈ ఏడాది రెండో పంట వేయొద్దని రైతులను కోరారు. సాగు చేస్తున్న పంటలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం శీతాకాలంలో ఉన్నా వేసవి మాదిరిగా ఎండలు విజృంభిస్తున్నాయని, భూగర్భ జలమట్టాల శాతం తగ్గిందని.. విద్యుత్ వినియోగం పెరిగిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన వాటా విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, ఇకనైనా ప్రతీ రూపాయి తప్పకుండా ఇవ్వాలని పొంగులేటి డిమాండ్ చేశారు. కాగా 'సర్'లో సుమారు 13 కోట్ల ఓట్లను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నవంబరు 1న ఢిల్లీలో 20 లక్షలమందితో జరిగే నిరసన, ధర్నా కార్యక్రమానికి రాష్ట్రం నుంచి 20వేల మంది కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. సీఈసీ తక్షణమే రాజీనామా చేయాలని, ఆయనను కఠినంగా శిక్షించాలని, తొలగించిన 13 కోట్ల ఓట్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలన్న ప్రధాన డిమాండ్లతో ఢిల్లీకి బయలు దేరుతున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు ఇంకా 12 రోజులే మిగిలి ఉన్నందు వల్ల కాంగ్రెస్ కుటుంబ సభ్యులు గ్రాడ్యుయేట్‌ల వద్దకు వెళ్లి ఓటు నమోదు చేయాలని కోరారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రతినిధి వేగి వెంకటేష్, అశ్వారావుపేట, ఇల్లెందు, భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# మూడ్రోజులు వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

తుపాను దిశను బట్టి తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈనెల 27-29వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మంగళవారం తర్వాత వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30--40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 28న ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ఆ మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదేవిధంగా జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈనెల 27--29 తేదీల మధ్య మేఘావృత వాతావరణంతోపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. 29న కూడా రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు కొనసాగవచ్చు. ఈనెల 30 నుంచి వర్షాల తీవ్రత తగ్గుతుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తుఫాను దిశ, వేగంలో మార్పులను బట్టి జిల్లాల వారీగా వర్షాల అంచనాలు మారవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

# భారత్‌లో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలం

(మొదటిపేజీ తరువాయి)

ఆస్ట్రేలియాలో నిర్వహించిన 'దసరా మిలన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హాజరైన భారతీయులు, ఆస్ట్రేలియా పౌరులనుద్దేశించి ప్రసంగించారు. "భారత్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మీరు ఆస్ట్రేలియాలో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. మీరంతా భారత్ గురించి ఆలోచించాలి. దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఇక్కడ స్థిరపడిన మీరంతా ఆస్ట్రేలియా ఆర్థిక రంగానికి వెన్నెముక. భారత్‌లోని విద్య, వైద్య సదుపాయాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయి. మీ స్నేహితులతో మన దేశ విజయ గాథలను, సాంకేతికతను, ఆవిష్కరణలను వివరించండి. భారత్.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారిని ఎప్పుడూ వ్యతిరేకిస్తుంది. ఈ విషయంలో మనపై ఎవరు ఎలాంటి నిందలు వేసినా, వాటిని ఎండగట్టాలి. ఒకప్పుడు దేశంలో ఐఎస్ఐ ప్రభావం ఉండేది. మోదీ ప్రధాని అయ్యాక ఆ పరిస్థితి మారింది. మీరంతా మన యోగాను, వారసత్వ సంపద గొప్పతనాన్ని, మన సంప్రదాయాలను విదేశీయులకు



తెలియజేయండి. మీ ఆస్ట్రేలియన్ స్నేహితులను భారత్‌కు తీసుకొచ్చి మన ప్రాచీన కట్టడాలను, ఆధ్యాత్మిక క్షేత్రాలను చూపించండి' అని కిషన్‌రెడ్డి ఆస్ట్రేలియాలో స్థిరపడిన తెలుగు ప్రజలకు పిలుపునిచ్చారు.

# మోదీ తండ్రి కూడా పోతారు

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణతో (సర్) అక్రమాలకు పాల్పడిన వారందరినీ కాంగ్రెస్ జైలుకు పంపిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వెంటనే సభలో ఉన్న ఓ వ్యక్తి స్పందిస్తూ.. "తిరుగుబాటు లేనంత కాలం ప్రధాని మోదీ ఎక్కడికీ వెళ్లరు" అని గట్టిగా అరిచారు. అందుకు ఖర్గే.. "మోదీ తండ్రి కూడా పోతారు" అని గట్టిగా బదులిచ్చారు. ఆయన వ్యాఖ్యపై భాజపాతోపాటు ఎన్డీయే కూటమిలోని జేడీ(యూ), లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్), హిందుస్థానీ ఆవామ్ మోర్చా వంటి పార్టీల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

### మాఫియా ముఠాలా కాంగ్రెస్ కనిపిస్తోంది: నబీన్

ఖర్గే వ్యాఖ్య కాంగ్రెస్ సైద్ధాంతిక దివాలాకోరుతనానికి అద్దం పడుతోందని భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. "దివంగతులైన కుటుంబ సభ్యులను బహిరంగ వేదికలపై ప్రసంగాల్లోకి లాగడం రాహుల్‌తోపాటు యావత్ ప్రతిపక్ష సంస్కృతిలా మారిపోయింది. ఒకప్పుడు గూండాలు మాట్లాడిన భాషను నేడు కాంగ్రెస్ అధ్యక్షుడు ఉపయోగిస్తున్నారు. వారు పూర్తిగా మాఫియా తరహాలో పని చేస్తున్నారు. కాంగ్రెస్ ఇంకెంత మాత్రమూ రాజకీయ పార్టీ కాదు.. అదొక మాఫియా ముఠాలా కనిపిస్తోంది" అని నబీన్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

### ఇదే తొలిసారి కాదు: అమిత్ షా

మోదీ తండ్రి గురించి అనుచిత వ్యాఖ్య చేయడం ద్వారా.. మర్యాదకు సంబంధించిన అన్ని ప్రమాణాలను ఖర్గే తుంగలోకి తొక్కారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. "మోదీపై, ఆయన కుటుంబంపై కాంగ్రెస్ అసభ్యకర భాష ఉపయోగించడం ఇదే తొలిసారేమీ కాదు. ప్రధాని తల్లిని అవమానించేలా గతంలో ఆ పార్టీ నేతలు మాట్లాడారు. మోదీ పేదరికాన్ని ఎగతాళి చేసేలా 'చాయ్‌వాలా' అని పిలిచారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రతిరోజూ అసభ్యత పరిమితులను దాటి ప్రవర్తిస్తోంది" అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# ఎయిర్‌పోర్ట్ తరహాలో నాలుగు ఆర్టీసీ టెర్మినళ్లు

### మంత్రి పొన్నం ప్రభాకర్

**జగిత్యాల :** ఎయిర్‌పోర్ట్ తరహాలో నాలుగు ఆర్టీసీ టెర్మినళ్లను నిర్మించనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆదివారం జగిత్యాల జిల్లా గ్రామీణ మండలం తాటిపల్లి-మోరపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో 25 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి మంత్రి లక్ష్మణ్‌కుమార్, విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి పొన్నం శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అత్యాధునిక సదుపాయాలతో నిర్మించనున్న టెర్మినళ్లకు ప్రైవేటు బస్సులు సైతం వచ్చే అవకాశం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే మహిళల కోసం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టామని, మహిళా సంఘాలకు బస్సుల నిర్వహణ బాధ్యత అప్పగించామని పేర్కొన్నారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని బస్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, ప్రతి గ్రామానికి బస్సు, ప్రయాణీకుల సంక్షేమంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. తొలగించిన ఉద్యోగులను తీసుకోవడం, కారుణ్య నియామకాలు, బకాయిల చెల్లింపు తదితర అన్ని విషయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని పొన్నం వివరించారు.




## సైకత శిల్పంతో దాసరి ప్రశాంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్‌పై సైకత శిల్పంతో అభిమానం చాటిన కొమ్మ సతీష్ యాదవ్**

**పెద్దపల్లి, ఇదే నిజం,అక్టోబర్ 25:** ట్రినిటీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు దాసరి ప్రశాంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ యువజన నాయకుడు కొమ్మ సతీష్ యాదవ్ వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి గోదావరి తీరాన ప్రశాంత్ రెడ్డి చిత్రపటంతో కూడిన అద్భుతమైన సైకత శిల్పాన్ని రూపొందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కొమ్మ సతీష్ యాదవ్ మాట్లాడుతూ విద్యారంగంలో ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ,యువతకు ఆదర్శంగా నిలుస్తున్న దాసరి ప్రశాంత్ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.



## తెలంగాణ రక్షక సేన పార్టీలో భారీ చేరికలు

**కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షురాలు సిరివేణి స్వప్న..**

**పెద్దపల్లి,ఇదే నిజం, అక్టోబర్ 25 :** తెలంగాణ రక్షక సేన పార్టీలోకి పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా చేరారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు సిరివేణి స్వప్న ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ సలేందర్ కొమురయ్య యాదవ్, సీనియర్ నాయకులు బోగని శంకర్ గౌడ్, ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్, ఎద్దు లక్ష్మీనారాయణ, గడ్డం లక్ష్మి ఆహ్వానం మేరకు కరీంనగర్ జిల్లా పట్టణ అధ్యక్షులు రంగారావేని లక్ష్మణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రక్షక సేన పార్టీలో చేరగా, సాగర్ల వాసవి" కూన రవళి సాగర్ల శ్రీశాంత్ "మౌటం మల్లికార్జున్ "మౌటం శ్రీకాంత్ వారికి పార్టీ నాయకులు స్వాగతం పలికారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.



## బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**చీకోడులో బీజేపీ టిఫిన్ బైఠక్ కార్యక్రమం**

**ఇదే నిజం, ముస్తాబాద్ :** మండలం చీకోడు గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు సౌల క్రాంతి కుమార్ నేతృత్వంలో, చీకోడు శక్తి కేంద్రం ఇన్‌చార్జి బాద నరేష్ ఆధ్వర్యంలో బీజేపీ టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, ముస్తాబాద్ గ్రామ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డితో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీ విస్తరణ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు, భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వివిధ స్థాయిల పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే గ్రామంలో ఉద్రిక్తతలు

**మాజీ సర్పంచ్ ఆడేపు వెంకటేష్**

**పెద్దపల్లి, ఇదే నిజం, అక్టోబర్ 25 :** పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలో ఇటీవల జరుగుతున్న గొడవలు, అల్లర్లకు కల్లెపల్లి అశోక్, మోదుంపల్లి శ్రావణ్, నవీన్ అనే ముగ్గురే కారణమని మాజీ సర్పంచ్ ఆడేపు వెంకటేష్ ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యేపై బురదజల్లేందుకే, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రోద్బలంతో వారు గ్రామంలో ఉద్రిక్తతలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఎస్సీ కాలనీలోని సీసీ కెమెరాలను ఎవరు, ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే మైనారిటీ యువకుడు బిలాల్‌పై దాడి, బ్లాక్‌మెయిలింగ్‌ను ఖండించారు. గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రయత్నించిన సీఐ ప్రవీణ్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ గొడవల్లో ఎమ్మెల్యే విజయ రమణారావు పేరును లాగడాన్ని రంగాపూర్ సర్పంచ్ గంట రమేష్ ఖండించారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు సాంబిరెడ్డి, సదయ్య, తిరుమల్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల కోసం కార్మిక భవనం నిర్మిస్తాం!

**పెద్దపల్లిలో రెండు గుంటల భూమి కేటాయిస్తాం..**
**ప్రభుత్వ విప్ విజయరమణ రావు హామీ**




**పెద్దపల్లి, ఇదే నిజం, అక్టోబర్ 25 :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవ సదస్సులో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, ఉద్యమ నాయకుడు, ఎమ్మెల్సీ కోదండరాంతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ.. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రెండు



గుంటల భూమిని కేటాయించి, అక్కడ కార్మిక భవనాన్ని నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. హమాలీ కార్మికులకు సొంతంగా ఒక భవనం అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, హమాలీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సదస్సులో పలువురు ప్రజాప్రతినిధులు, హమాలీ సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ బచావో-దేశ్ బచావోపై కాంగ్రెస్ అవగాహన

**కరీంనగర్ (ఇదే నిజం) అక్టోబర్.25 :** ఓట్ బచావో -- దేశ్ బచావో నినాదంతో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై నాయకులు చర్చించారు. ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు, ఓటర్ల హక్కుల పరిరక్షణకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని నాయకులు



సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

**కరీంనగర్ (ఇదే నిజం) :** రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 6.30 గంటలకు ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ధర్మపురిలో బస్టాండ్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొననుండగా,



11 గంటలకు జగిత్యాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఎస్టీఆర్‌వీఎల్ ఇన్‌ఫ్రా డెవలపర్స్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు సమాచారం. మంత్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మహిళా సర్పంచుల శిక్షణలో పాల్గొన్న జూలపల్లి సర్పంచ్ అనూష

**సమాచార హక్కు చట్టం, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ వ్యవహారాలపై శిక్షణ**

**జూలపల్లి, ఇదేనిజం, అక్టోబర్ 25 :** హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మూడు రోజులపాటు నిర్వహించిన మహిళా సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోని జూలపల్లి గ్రామ సర్పంచ్ పాతకుల అనూష పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, గ్రామీణ అభివృద్ధి, గ్రామపంచాయతీల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై ఆమె అవగాహన పొందారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణలో సమాచార హక్కు చట్టం, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ విధులు, గ్రామపంచాయతీల పరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడం, పారదర్శకమైన పాలన అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని



విజయవంతంగా పూర్తి చేసిన జూలపల్లి సర్పంచ్ పాతకుల అనూషకు నిర్వాహకులు సర్టిఫికెట్ అందజేశారు. ఈ శిక్షణ ద్వారా గ్రామాభివృద్ధికి అవసరమైన పరిపాలనా అంశాలపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం లభించింది. గ్రామపంచాయతీల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేయడంలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## అమరవీరుల సంస్మరణార్థం ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ

**కరీంనగర్‌లో 20 కిలోమీటర్ల ర్యాలీ.. పాల్గొన్న పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**

**కరీంనగర్ (ఇదే నిజం) అక్టోబర్ 25 :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ నగరంలో ఆదివారం నిర్వహించిన 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ అత్యంత ఉత్సాహంగా సాగింది. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం స్వయంగా ఈ ర్యాలీలో పాల్గొని, ముందుండి నడిపించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని పరేడ్ గ్రౌండ్ వద్ద ప్రారంభమైన సైకిల్ ర్యాలీలో పోలీసులు, యువకులు, నగర పౌరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సైక్లిస్టులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సైతం సైకిల్ తొక్కుతూ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా అమరవీరుల సేవలు, త్యాగాలను ప్రజలకు గుర్తుచేశారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన



పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. అలాగే, నిత్యజీవితంలో సైక్లింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.



## జీహెచ్ఎంసీ కార్మికులకు దసరా కానుకలు..

**చీరలు పంపిణీ చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలరాం యాదవ్..**

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 25(ఇదేనిజం) :** దసరా పండుగ సందర్భంగా జీహెచ్ఎంసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బలరాం యాదవ్ చీరలు పంపిణీ చేశారు. పండుగ వేళ కార్మికులతో సంతోషాన్ని పంచుకునే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు నిత్యం సేవలందిస్తూ నగర పరిశుభ్రతకు కృషి చేస్తున్న జీహెచ్ఎంసీ కార్మికుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పండుగ సమయంలో కార్మికులతో ఆనందాన్ని పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు.





## ముస్తాబాద్ శివకేశవ ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**ఇదే నిజం, ముస్తాబాద్ :** మండల కేంద్రంలోని శ్రీ శివకేశవ దేవాలయంలో ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను కొనసాగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని సుందరంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి, ఆలయ పరిసరాల్లో పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారి పల్లకి సేవను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ శివకేశవ స్వామివారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## పూసల సంఘం భవన నిర్మాణానికి ఎంపీ నిధుల కేటాయిస్తా

- బోర్వెల్ కూడా వేయిస్తా : ఎంపీ గడ్డం వంశీ
- పూసల సంఘం నూతన అధ్యక్షుడు కుమారస్వామికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అభినందనలు

**పెద్దపల్లి, ఇదే నిజం, అక్టోబర్ 25 :** పూసల సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కుమారస్వామి గారికి, నూతన కార్యవర్గ సభ్యులందరికీ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ గారు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూసల సంఘం ప్రతినిధులతో సమావేశమైన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, భవన నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. గతంలో పూసల సంఘం భవన నిర్మాణం కోసం సంఘం ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిని గుర్తుచేస్తూ, పూసల సంఘం భవన నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి అవసరమైన నిధులను కేటాయించేందుకు కృషి చేస్తానని, సంఘం అవసరాల దృష్ట్యా బోర్వెల్ కూడా వేయిస్తానని హామీ ఇచ్చారు. పూసల సంఘం సభ్యుల ఐక్యత, సంఘం అభివృద్ధి ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, నూతన కార్యవర్గం సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పూసల సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. సంఘం అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం చేస్తున్న కృషికి తన మద్దతు ఉంటుందని తెలిపారు.

# ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రూ.38 కోట్లతో మద్దులపల్లి - గొల్లగూడెం నాలుగు లైన్ల రహదారి: పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఏదులాపురం, అక్టోబర్ 25 :** ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనితతో కలిసి మంత్రి పర్యటించారు. రూ.38 కోట్ల వ్యయంతో మద్దులపల్లి నుంచి గొల్లగూడెం వరకు చేపట్టనున్న నాలుగు లైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్, డివైడర్, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులతో పాటు రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న జంక్షన్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. మద్దులపల్లి నుంచి గొల్లగూడెం వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం పూర్తయితే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే ప్రభుత్వం రూ.75.50 కోట్ల నిధులు మంజూరు చేసిందని,



మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇప్పటి వరకు సుమారు రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కేటాయింపులు జరిగాయని వెల్లడించారు. రాష్ట్రంలో ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గత పాలకులు సృష్టించిన ఆర్థిక అవరోధాలను అధిగమిస్తూ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు.



**సూపర్ ఎల్ నినోపై మంత్రి వ్యాఖ్యలు:**

సూపర్ ఎల్ నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, రానున్న రోజుల్లో నీటి లభ్యతపై అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని మంత్రి అన్నారు. వానాకాలం తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చుకైనా వెనుకాడదని, అయితే నీటి కొరత దృష్ట్యా రైతులు రెండో పంట వేయవద్దని, ఉన్న నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించాలని, బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ.. ఆదివారం గిరిజన భవన్, వసతి గృహం, పలు రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని, రూ.38 కోట్ల రహదారి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ అనిత మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి నాయకత్వంలో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎన్.శ్రీనివాస్, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల హక్కుల కోసం రెవెన్యూ సిబ్బంది నివాస ముట్టడి

**కరీంనగర్ (ఇదే నిజం )అక్టోబర్.25 :** ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల పోరాట ఉమ్మడి జిల్లా చైర్మన్ జి.పి.ఎస్. ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి బొల్లం లింగమూర్తి, నగర అధ్యక్షుడు గోంజాల రమేష్ గౌడ్ తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ హోటల్ తారకలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, అర్హులకు తగిన న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి ఉద్యమకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు కోరారు. ఈ సమావేశంలో పలువురు ఉద్యమకారుల నాయకులు పాల్గొన్నారు.



## అబుదాబిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఘన సత్కారం

**కరీంనగర్ (ఇదే నిజం )అక్టోబర్ 25 :** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, ధర్మపురి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్‌కు అబుదాబిలో ఘన సత్కారం లభించింది. అబుదాబిలో అత్యంత వైభవంగా నిర్వహించిన తెలుగు దసరా సంబరాలు, డాక్టర్స్ అవార్డ్స్--2026 వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుబాయిలో ఉపాధి నిమిత్తం స్థిరపడిన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన ప్రవాస తెలంగాణ వాసులు, కొప్పుల ఈశ్వర్ అభిమానులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్వగ్రామంతోపాటు తమ ప్రాంతానికి చెందిన నాయకుడిపై అభిమానాన్ని కొనసాగిస్తూ ఆయనను కలవడం ప్రత్యేకతను సంతరించుకుంది. విదేశాల్లో ఉపాధి పొందుతున్నప్పటికీ మాతృభూమిపై మమకారాన్ని, తనపై అభిమానాన్ని చాటుకున్న ప్రవాస తెలంగాణ వాసులకు కొప్పుల ఈశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతోపాటు, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.




## సీబీసీఐడీ విచారణలో జమ్మికుంట రైస్ మిల్లర్లు

**కరీంనగర్ (ఇదే నిజం) :** సీబీసీఐడీ విచారణలో జమ్మికుంట రైస్ మిల్లర్ల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యం సర్దుబాటులో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీబీసీఐడీ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పలువురు రైస్ మిల్లర్లను విచారిస్తున్నట్లు సమాచారం. లక్షల క్వింటాళ్ల ధాన్యం, బియ్యం నిల్వల లెక్కల్లో తేడాలు, లక్షల స్థాయి ఇండెంట్లు, రాధాకృష్ణ మిల్లుల యజమానుల వ్యవహారాలు, వొల్లాల మల్లికార్జున్, యాసాని సంపత్, లెక్కలపల్లి మధు తదితరుల పాత్రపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. కరీంనగర్‌లోని సీబీసీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో ఈ విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. బియ్యం నిల్వలు, సరఫరా లెక్కలు, సంబంధిత పత్రాలను పరిశీలిస్తూ అక్రమాల వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ వ్యవహారంలో ఎవరిపై ఎలాంటి ఆరోపణలు నిర్ధారణ అయ్యాయనే అంశంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దర్యాప్తు పూర్తయిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



## అయోధ్య-కాశీ యాత్ర బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**కరీంనగర్ (ఇదే నిజం) :** అయోధ్య--కాశీ పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లే యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన రెండు బస్సులను కరీంనగర్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. గంగ నారాయణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని బస్సులకు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధ్యాత్మిక యాత్రలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతాయని పేర్కొన్నారు. అయోధ్యలోని శ్రీరాముడి ఆలయం, కాశీ విశ్వేశ్వరుడి క్షేత్రం వంటి పవిత్ర స్థలాలను సందర్శించడం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుందన్నారు. యాత్రికులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ పుణ్యక్షేత్రాల సందర్శనను సులభతరం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 9 గంటల నిరంతర కూచిపూడి నృత్య ప్రదర్శన

**మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి: మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



**సికింద్రాబాద్ :** మన భారతీయ సంస్కృతి, సంప్రదా యాలు, కళలు ఎంతో గొప్పవని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో లాలి నిధి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 9 గంటల నిరంతర కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లాలి నిధి, ఆమె బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలను తిలకించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. దేశవిదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు విశేష గుర్తింపు లభిస్తుండగా, మన ప్రాంతంలో కొందరు వాటిని పాటించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నతనం నుంచే లాలి నిధి కూచిపూడి సహా వివిధ నృత్య కళల్లో ప్రతిభ కనబరుస్తూ అనేక ప్రదర్శనలు ఇచ్చి, పలు అవార్డులను అందుకోవడం అభినందనీయమన్నారు. ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి చేతుల మీదుగా 'లాలి' బిరుదును అందుకున్న నిధి, అనంతరం లాలి నిధి నృత్య అకాడమీని స్థాపించి ఎంతోమందికి కూచిపూడి నృత్యంలో శిక్షణ అందించడం ప్రశంసనీయమని అన్నారు. ఎటువంటి విరామం లేకుండా తొమ్మిది గంటల పాటు కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించడం అసాధారణమైన ప్రతిభకు, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగాల్లోనూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు స్వర్ణ, వెంకటేష్ దంపతులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు టి. శ్రీహరి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## బస్తీ సమస్యల పరిష్కారానికి 'బస్తీ బాట'

**పెండింగ్ పనులు పూర్తి చేస్తాం: నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్**




**సికింద్రాబాద్ :** బస్తీల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఆరో వార్డు తాడ్‌బండ్ తవైపుర బస్తీలో ఆదివారం నిర్వహించిన 'బస్తీ బాట' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ.. గతంలో నర్మద మల్లికార్జున్ బోర్డు సభ్యురాలిగా, ఉపాధ్యక్షురాలిగా ఉన్న సమయంలో డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి పైపులైన్లు, రహదారుల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తుచేశారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పింఛన్లు, కేంద్ర ప్రభుత్వ దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందేలా కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుతం బస్తీలో రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వీధి దీపాల కొరత వేధిస్తోందని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. మధ్యలో నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన నర్మద మల్లికార్జున్.. కంటోన్మెంట్ అధికారులతో మాట్లాడి ఆయా పనులకు సంబంధించిన అంచనాలు సిద్ధం చేయిస్తానని తెలిపారు. రానున్న బోర్డు సమావేశంలో నిధుల మంజూరుకు కృషి చేసి, పెండింగ్ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## శామీర్‌పేట్ గోదాములో ఉద్యోగ అవకాశాలు

**సద్వినియోగం చేసుకోండి : జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.రాధిక**



**మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ లో కొత్తగా ఏర్పడిన వేర్ హౌస్ లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్టు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం. రాధిక తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడిస్తూ, జిల్లాలోని నిరుద్యోగ అవకాశాలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడిస్తూ, పదవ తరగతి ఆపై విద్యా అర్హతలున్న అభ్యర్థులు, తగిన పత్రాలతో గోదాం ఇంచార్జీని సంప్రదించవచ్చు అన్నారు. 8 గంటల పని, 26 రోజుల రొటేషన్ సిస్టమ్, నాలుగు వీక్లీ ఆఫ్ లు, రూ.19,500 వేతనం, ఇ.ఎస్.ఐ, పీ.ఎఫ్, ఉచిత ట్రాన్స్ పోర్ట్ సౌకర్యం ఉందని వెల్లడించారు. అభ్యర్థులు పికింగ్, ప్యాకింగ్, స్కానింగ్, స్టోయింగ్ పనులు చేయాల్సి ఉంటుంది. మంచి పని విధానం, స్థిరమైన ఉద్యోగం, గ్రోత్ కు అవకాశం ఉందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు 7730820444 కు సంప్రదించ వచ్చని ఆమె సూచించారు. అలాగే, జిల్లాలోని అనేక ప్రైవేట్ కాలనీలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, జిల్లాలోని నిరుద్యోగ యువత తమ పేరును www.employment.telangana. gov.inలో నమోదు చేసుకోవాలని కూడా ఆమె కోరారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ రాద్ధాంతం చేస్తోంది

**బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్**

**కరీంనగర్ (ఇదే నిజం) :** చొప్పదండి మండలంలోని వేదురుగట్టులో ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్' బూత్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం భారత ఎన్నికల సంఘం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రక్షాళన చేయడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. అనర్హమైన ఓట్లను తొలగించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంపొందించడంతో పాటు ఓటర్ల జాబితాలో పారదర్శకతను తీసుకురావడానికి ఎస్ఐఆర్ దోహదపడుతుందని వివరించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న చర్యలను రాజకీయ కోణంలో చూడకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలుగా గుర్తించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చంద్రపురి కాలనీ డివిజన్ సమస్యలు పరిష్కరిస్తా : శ్రీకాంత్ యాదవ్

**జవహర్‌నగర్ :** కీసర సర్కిల్ పరిధిలోని చంద్రపురి కాలనీ డివిజన్ లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఆదివారం డివిజన్ పరిధిలోని శాంతినగర్, వెంకటేశ్వర కాలనీలో పర్యటించి కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, శానిటేషన్ వంటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సాయి కృష్ణ, శ్రీనివాస్, బాలు ముదిరాజ్, శోభారాణి, సురేష్, రమేష్, గిరిరాజు, రవి, భాను తదితరులు పాల్గొన్నారు.



# అవినీతికి గేట్లు ఎత్తేస్తే.. ఇంకెందుకు ఏసీబీ?

**లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉద్యోగిపై ఏసీబీ విచారణ జరిపింది. ఆధారాలు సేకరించింది. న్యాయస్థానంలో కేసు నడిపేందుకు అవసరమైన ప్రక్రియను చేపట్టింది. అయినా ప్రాసిక్యూషన్‌కు అనుమతి లభించకపోతే? శాఖాపరమైన చర్యలతో సరిపెట్టాలన్న నిర్ణయంతో కేసు ముందుకు సాగకపోతే? తెలంగాణలో 2023 నుంచి కనీసం 20 ఏసీబీ కేసులు ప్రాసిక్యూషన్‌కు అనుమతి నిరాకరణతో ముగిసినట్లు వార్తలు రావడం ఇలాంటి ప్రశ్నలనే లేవనెత్తుతోంది. ప్రభుత్వ నిర్ణయాలపై సమర్థనీయమైన వివరణ కోరడం ప్రజల హక్కు.**




అనుమతి నిరాకరణకు కారణాలేమిటి? వార్తల్లో వెల్లడైన కేసుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడిన ట్రాప్ కేసులతోపాటు, ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారాలూ ఉన్నాయి. మహబూబ్‌నగర్ మాజీ మున్సిపల్ కమిషనర్ ఉదంతం చర్చనీయాంశమైంది. 2020 అక్టోబరు 22న ఓ పనికి సంబంధించిన వర్క్ ఆర్డర్ కోసం రూ. 1.65 లక్షల లంచం తీసుకుంటూ ఆయన ఏసీబీకి పట్టుబడినట్లు కథనాలు పేర్కొన్నాయి. విచారణ అనంతరం ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరినా, శాఖాపరమైన చర్యలే సరిపోతాయన్న నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మాజీ హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం డైరెక్టర్‌పై నమోదైన అక్రమాస్తుల కేసుతోపాటు మరికొన్ని కేసుల విషయంలోనూ ఇలాంటి పరిణామాలు వెలుగులోకి వచ్చాయి.

ఇక్కడ రెండు విషయాలను వేర్వేరుగా చూడాలి. ఏసీబీ కేసు నమోదు చేయడం, ఆధారాలు సేకరించడం ఒక ప్రక్రియ. నిందితుడిపై క్రిమినల్ కేసు నడపడానికి అవసరమైన చట్టపరమైన అనుమతుల పరిశీలన మరో ప్రక్రియ. ప్రభుత్వ అనుమతి నిరాకరించినంత మాత్రాన సంబంధిత ఉద్యోగి నిర్దోషి అని తేలిపోదు, ఏసీబీ కేసు నమోదు చేసినంత మాత్రాన నేరం నిరూపితమైనట్లూ కాదు. అంతిమంగా నేర నిర్ధారణ న్యాయస్థానం పరిధిలోని అంశం. అయితే, విచారణకు అనుమతి ఇవ్వకపోవడం వల్ల న్యాయస్థానం పరిశీలించే అవకాశమే తగ్గితే, ఆ నిర్ణయానికి బలమైన కారణాలు ఉండాలి.

ప్రభుత్వం, ఏసీబీ బాధ్యతలు వేర్వేరు, ఏసీబీ బాధ్యత అవినీతి ఆరోపణలపై నిష్పాక్షికంగా విచారణ జరపడం, చట్టబద్ధమైన ఆధారాలు సేకరించడం, సంబంధిత అధికారుల ద్వారా తదుపరి న్యాయ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవడం. ప్రభుత్వం బాధ్యత చట్టానికి అనుగుణంగా ప్రాసిక్యూషన్ అనుమతిపై నిర్ణయం తీసుకోవడం. ఉద్యోగుల హక్కులను కాపాడటం ఎంత ముఖ్యమో, రాజకీయ లేదా పరిపాలనా పలుకుబడితో న్యాయ ప్రక్రియ ప్రభావితం కాకుండా చూడటమూ అంతే ముఖ్యం. శాఖాపరమైన చర్యలు, క్రిమినల్ విచారణ రెండింటి లక్ష్యాలూ వేరు. ఉద్యోగ నియమావళి ఉల్లంఘనకు శాఖాపరమైన చర్యలు తీసుకోవచ్చు. కానీ, నేరానికి సంబంధించిన ఆరోపణలుంటే చట్టం నిర్దేశించిన ప్రక్రియను అనుసరించాలి. ఒకదానితో మరొకటి ఆటోమేటిక్‌గా భర్తీ కావు. అదే సమయంలో, ప్రతి కేసులోనూ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలన్నది సరైన విధానం కాదు. ఆధారాల బలం, చట్టపరమైన లోపాలు, సంబంధిత అధికారుల వివరణలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి.

ప్రభుత్వానికి సూచనలు. ప్రాసిక్యూషన్‌కు అనుమతి నిరాకరించిన కేసులపై ప్రభుత్వం కారణాలతో కూడిన ఉత్తర్వులను నమోదు చేయాలి. చట్టం అనుమతించే మేరకు వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. మూతపడిన కేసులను స్వతంత్ర న్యాయ నిపుణుల బృందంతో సమీక్షించి, అవసరమైతే చట్టబద్ధమైన తదుపరి చర్యలు చేపట్టాలి. అనుమతి అభ్యర్థనలపై నిర్ణయాలను అనవసరంగా వాయిదా వేయకుండా, చట్టం నిర్దేశించిన గడువులను పాటించాలి. ఏసీబీ దర్యాప్తులో రాజకీయ లేదా ఇతర అనుచిత జోక్యానికి తావులేకుండా సంస్థాగత స్వతంత్రతను బలోపేతం చేయాలి. ప్రతిపక్షం ఈ వ్యవహారంపై ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజం. అయితే, ఆరోపణలను రాజకీయ ప్రచారానికి మాత్రమే పరిమితం చేయకుండా, కేసుల వివరాలు, అనుమతి నిరాకరణకు ఇచ్చిన కారణాలు, సంబంధిత ఉత్తర్వులను ప్రజల ముందుంచాలని ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రజలూ వాస్తవాలను పరిశీలించి ప్రశ్నించాలి. ఆరోపణనే తీర్పుగా భావించకూడదు, అధికారిక వివరణ లేకపోవడాన్ని కూడా తేలికగా తీసుకోకూడదు.

### నిజాయతీకి రక్షణ, అవినీతికి శిక్ష

ఏసీబీ అధికారులు కష్టపడి సేకరించిన ఆధారాలు తగిన కారణాలు లేకుండా పక్కనపడితే వారి మనోధైర్యం దెబ్బతింటుంది. మరోవైపు, ఆధారాలు బలహీనంగా ఉన్న కేసుల్లోనూ ఉద్యోగులను విచారణ లేకుండా దోషులుగా చిత్రీకరించడం అన్యాయం. ఈ రెండు ప్రమాదాల మధ్య సమతుల్యత పాటించడమే సుపరిపాలన. ప్రభుత్వం ఉద్యోగులను కాపాడాల్సింది వారి హక్కులను పరిరక్షించడం ద్వారా, అవినీతి ఆరోపణలను కప్పిపుచ్చడం ద్వారా కాదు. ఏసీబీకి స్వతంత్రంగా పనిచేసే వాతావరణం, ప్రజలకు నిర్ణయాలపై పారదర్శకత, నిందితులకు న్యాయమైన ప్రక్రియ లభించాలి. ప్రాసిక్యూషన్‌కు అనుమతి నిరాకరించడం తప్పు అని ముందే తీర్పివ్వలేం. కానీ, ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో చెప్పాల్సిందే. అవినీతిపై పోరాటంలో ప్రభుత్వ విశ్వసనీయతకు అసలైన పరీక్ష అక్కడే.

– కొలను వెంకటేశ్వర రెడ్డి
రిటైర్డ్ ఎస్పీ, తెలంగాణ జైల్స్

# 2029 తర్వాత ఎవరు?

**సంస్థాగత బలం, జనాకర్షణ, సంకీర్ణ ధర్మం మధ్య పోటీ**

**సీజేపీ ప్రభావం, యువత రాజకీయ చైతన్యం, బీజేపీ వారసత్వ పరీక్ష.**

**నరేంద్ర మోదీ తర్వాత ఎన్డీయే నాయకత్వం ఎవరిది? 2029 ఎన్నికలకు ముందే ఈ ప్రశ్న రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. మోదీ రాష్ట్రపతి పదవికి వెళ్తారనే ప్రచారం ఇంకా ఊహాగానాల దశలోనే ఉంది. అయితే, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువత కేంద్రంగా సాగుతున్న రాజకీయ నిరసనలు, ప్రజాస్వామ్యంపై చర్చలు భవిష్యత్తు రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది కూడా పరిశీలించాలి.**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్టీ సంస్థాగత బలానికి ప్రతీక. ఎన్నికల వ్యూహాలు, రాష్ట్రాల వారీగా పార్టీ నిర్మాణం, రాజకీయ సమీకరణాల్లో ఆయనకు అనుభవం ఉంది. మరోవైపు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హిందుత్వ భావజాలం, కఠిన పాలన అనే ప్రతిమతో ప్రత్యేక గుర్తింపు పొందారు. 2022 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 255 స్థానాలు గెలుచుకోవడం ఆయన నాయకత్వానికి బలాన్నిచ్చింది. అయితే, రాష్ట్రంలో విజయాన్ని జాతీయ స్థాయి ప్రజాదరణకు నేరుగా సమానంగా చూడలేం. ఇద్దరిలో ఎవరు ప్రధాని పదవికి మెరుగైన ఎంపిక అనేది పార్టీ నిర్ణయం, ప్రజాభిప్రాయం, మిత్రపక్షాల వైఖరిపై ఆధారపడి ఉంటుంది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 స్థానాలకే పరిమితమైంది. ప్రభుత్వ ఏర్పాటుకు తెలుగుదేశం, జేడీయూ వంటి మిత్రపక్షాల మద్దతు అవసరమైంది. ఇది సంకీర్ణ రాజకీయాల్లో భాగస్వాముల ప్రాధాన్యాన్ని గుర్తుచేసింది. తదుపరి నాయకుడికి పార్టీపై పట్టు, ప్రజాకర్షణతో పాటు మిత్రపక్షాలతో సమన్వయం చేసుకునే సామర్థ్యం అవసరం.

ఇదే సమయంలో సీజేపీ వంటి రాజకీయ వేదికలు యువతలో ఎన్నికల పారదర్శకత, ఎన్నికల సంఘం జవాబుదారీతనం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వంటి అంశాలపై చర్చను ముందుకు తెస్తున్నాయి. అయితే, వాటి ప్రభావాన్ని అతిశయోక్తి చేయడం సరికాదు. నిరసనలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మాత్రమే ఎన్నికల ఫలితాలను మార్చలేవు. స్పష్టమైన విధానాలు, విశ్వసనీయమైన ఆధారాలు, ప్రజల సమస్యలపై నిరంతర కృషి ఉంటేనే యువజన రాజకీయాలకు దీర్ఘకాలిక ప్రాధాన్యం లభిస్తుంది. అధికార పక్షంపై విమర్శలు చేసినంత మాత్రాన ఆరోపణలు నిజం కావు, అదే సమయంలో అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో తప్పు కూడా కాదు.

సీజేపీ ప్రభావం బీజేపీ వారసత్వ పోటీపై ప్రత్యక్షంగా ఎంత ఉంటుందో చెప్పలేం. కానీ యువత దృష్టిని ఉద్యోగాలు, విద్య, ధరలు, అవినీతి, ఎన్నికల పారదర్శకత వంటి అంశాలపై నిలిపితే, అన్ని పార్టీలూ తమ విధానాలను సమర్థించుకోవాల్సి వస్తుంది. ఇది బీజేపీతో పాటు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకూ వర్తిస్తుంది. యువతను కేవలం ఓటర్లుగా కాకుండా, ప్రజాస్వామ్యాన్ని పర్యవేక్షించే పౌరులుగా చూడాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు గుర్తుచేస్తున్నాయి.

నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్ సింగ్ వంటి సీనియర్ నేతలు సంకీర్ణ పరిస్థితుల్లో అంగీకారయోగ్యమైన నాయకులుగా చర్చకు రావచ్చు. ఎస్. జైశంకర్, అశ్విని వైష్ణవ్ వంటి నేతలకు పరిపాలనా అనుభవం ఉన్నా, ప్రధాని పదవికి దేశవ్యాప్త రాజకీయ మద్దతు కూడా అవసరం. మోదీ రాష్ట్రపతి అవుతారనే ప్రచారాన్ని నిర్ధారిత నిర్ణయంగా భావించడం తొందరపాటు.

అసలు ప్రశ్న మోదీ తర్వాత ఎవరు అనేది మాత్రమే కాదు, బీజేపీ ఎలాంటి నాయకత్వ నమూనాను ఎంచుకుంటుంది, ప్రజల విశ్వాసాన్ని ఎలా నిలబెట్టుకుంటుంది అన్నది. సంస్థాగత బలం, జనాకర్షణ, సమర్థ పాలన, సంకీర్ణ ధర్మం కీలకం. సీజేపీ వంటి వేదికల ప్రభావం కూడా యువత ఆగ్రహాన్ని ఆధారబద్ధమైన ప్రజా చర్చగా, బాధ్యతాయుతమైన పౌర భాగస్వామ్యంగా మార్చగలిగితేనే నిలుస్తుంది. నాయకులు మారవచ్చు, పార్టీలు మారవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రశ్నలు మారకూడదు. యువత వ్యక్తిపూజకు, అంధ వ్యతిరేకతకు అతీతంగా నిజాలను పరిశీలించి, సామాన్యుడి సమస్యల పక్షాన నిలబడినప్పుడే రాజకీయ మార్పుకు అర్థం ఉంటుంది.

– కొలను వెంకటేశ్వర రెడ్డి
ఎస్పీ రిటైర్డ్, తెలంగాణ జైల్స్

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. గ్రాడ్యుయేట్స్ కదం తొక్కాలే.!

- ప్రజా వ్యతిరేఖ కాంగ్రెస్‌ను తెలంగాణలో భూస్థాపితం చేయాలి
- పీర్జాదిగూడలో జరిగిన సమావేశంలో క్యామ మల్లేశం



**పీర్జాదిగూడ :** త్వరలోనే జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్స్ అందరూ కదం తొక్కాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు క్యామ మల్లేశం అన్నారు. ప్రజా వ్యతిరేఖ కాంగ్రెస్‌ను తెలంగాణలో భూస్థాపితం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ జిల్లాల గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ, ఓటర్ నమోదుకు సంబంధించిన ముఖ్య నాయకుల సమావేశం మేడిపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పార్టీ అధిష్టానం మేడ్చల్ అసెంబ్లీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జిగా నియమించిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు క్యామ మల్లేశం ముఖ్య అతిథిగా పాల్గొని బీఆర్ఎస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ నమోదు కొరకు ఏర్పాటు చేసిన 18 కేంద్రాలను క్యామ మల్లేశం సందర్శించి, ఓటర్ నమోదు కేంద్రం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులను అభినందించారు. ప్రతి గ్రాడ్యుయేట్ ఓటర్ గా నమోదు అయ్యేలా చూడాలన్నారు. జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలో ఇప్పటికే 18 కేంద్రాల్లో ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. వివిధ డివిజన్ ల మాజీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతి డివిజన్ లో ఓటర్ నమోదు ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ప్రతి ఒక్కరి ఇంట్లో గ్రాడ్యుయేట్స్ ఉన్నారని, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ఓటములు ఓటర్ నమోదుపై ఆధారపడి ఉంటాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిరుద్యోగ యువత, జెన్-జీలు కాంగ్రెస్ పార్టీపై, సిఎం రేవంత్ పరిపాలనపై విసుగు చెందారన్నారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఏ ఎన్నికల్లోనూ గెలిచే పరిస్థితి లేదన్నారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, కొల్తూరి మహేష్, కవిడే పోషయ్య, మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు కొరిపెల్లి నిర్మల, సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, మహిళా నాయకురాలు కల్యాణి, సంధ్య, నాయకులు సాయిశెట్టి, కోల శ్రీనివాస్, అశోక్, అక్షిత్ యాదవ్, ఖైసర్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు చిరంజీవి, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# టీజీ-ఐపాస్ పోర్టల్‌పై సైబర్ దాడి

**సర్వర్ హ్యాక్.. ఫైళ్లు ఎన్‌క్రిప్ట్ అయినట్లు నిర్ధారణ**

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన జీ2బీ(గవర్నమెంట్ టు బిజినెస్) సేవల్ని అందించే స్టేట్ సింగిల్ విండో పోర్టల్ టీజీ-ఐపాస్‌పై సైబర్ దాడి జరిగింది. పోర్టల్ సర్వర్‌ను హ్యాక్ చేయడంతోపాటు అందులోని డేటాబేస్‌ను సైబర్ నేరస్థులు ఎన్‌క్రిప్ట్ చేశారు. ఈనెల 22న రాత్రి 11.36 గంటలకు ఈ దాడి జరిగింది. దీంతో పోర్టల్ అప్లికేషన్ పనిచేయడం నిలిచిపోయింది. సాంకేతిక బృందం సరిచేసేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. క్లౌడ్4సీ సంస్థను సంప్రదించి సర్వర్‌ను రీస్టార్ట్ చేసినా సమస్య పరిష్కారం కాలేదు. అనంతరం చేసిన పరిశీలనలో ఎస్‌క్యూఎల్ సర్వర్ ఏజెంట్ సర్వీస్ నిలిచిపోయినట్లు గర్తించారు. ఆ సర్వీస్‌ను ప్రారంభించాలని క్లౌడ్4సీ సంస్థను కోరినా సేవల్ని పునరుద్ధరించడం కుదరలేదు. ఈ క్రమంలోనే సర్వర్ హ్యాక్ అయినట్లు తేల్చారు. గుర్తుతెలియని మెషిన్ ఐడెంటిఫయర్‌తో కూడిన రాన్సమ్‌నోట్ సర్వర్‌లో కనిపించింది. సైబర్ నేరస్థులు ఒక సంప్రదింపు ఈమెయిల్ చిరునామాను సర్వర్‌కు పంపించారు. టీజీ-ఐపాస్ అప్లికేషన్‌తోపాటు డేటాబేస్ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. డేటాను తొలగించకపోవడాన్ని బట్టి రాన్సమ్‌వేర్ దాడిగా అనుమానించి అధికారులు శనివారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి ఫిర్యాదు చేశారు. డేటా బయటికి వెళ్లిందేమో పరిశీలించాలని, డేటాబేస్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు సహకరించాలని అధికారులు సైబర్ సెక్యూరిటీ బ్యూరోని కోరారు.



# మంచిర్యాల జిల్లాలో విషాదం..

**నీటికుంటలో పడి ముగ్గురి మృతి**

**మంచిర్యాల :** పొట్టకూటి కోసం ఊరుకాని ఊరువచ్చి దుస్తులు ఉతుక్కుందామని వెళ్లి కుంటలో పడి ఓ మహిళ, ఇద్దరు బాలికలు మృతిచెందారు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని కాసీంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా మంగళగూడెం గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు గ్యాస్ స్టవ్‌లు బాగు చేసుకుంటూ సంచార జీవనం సాగిస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం మోట్టం మన్నెమ్మ(24), కీర్తన(16), మదేని కావ్య(9)లు సమీపంలో ఉన్న కుంటలో దుస్తులు ఉతికేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కుంటలో పడిపోగా చాలా సమయం వరకు రాకపోవడంతో అనుమానంతో వారి సంబంధీకులు అక్కడి వెళ్లగా వారు చనిపోయిన విషయం తెలిసింది. సమాచారం అందుకున్న సీఐ నవీన్, ఎస్సై భూమేష్ ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# అమెరికా సాయం ఉక్రెయిన్ ధనవంతులకే చేరుతోంది: మస్క్

**కీవ్:** అమెరికా అందిస్తున్న వందల బిలియన్ల డాలర్ల సాయం వల్ల ఉక్రెయిన్‌లోని సంపన్నులు మరింత ధనవంతులవుతున్నారని టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యాతో యుద్ధం కారణంగా... సాయం కింద ఉక్రెయిన్‌కు వెళ్తున్న వందల బిలియన్ల డాలర్లతో అక్కడి సంపన్నులు మరింత సంపద కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు. సామాన్య ప్రజల పిల్లలు మాత్రం యుద్ధంలో పోరాడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. మస్క్ వ్యాఖ్యలపై ట్రంప్ స్పందిస్తూ ఆయనకు మద్దతుగా మాట్లాడారు. ఆయన న్యాయంగా వ్యవహరించే వ్యక్తి అంటూ ప్రశంసించారు. ఉక్రెయిన్ సైన్యం, డ్రోన్ల నిర్వహణకు ఎంతో కీలకమైన స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలపై విధించిన వేగ పరిమితులను ఎట్టకేలకు తొలగించినట్లు ఉక్రెయిన్ రక్షణ శాఖ శనివారం వెల్లడించింది. ప్రస్తుతం గంటకు 400 కి.మీ వేగంతో ప్రయాణించగల పరికరాలు కూడా ఈ ఇంటర్నెట్ వేగంతో పనిచేయగలుగుతున్నాయని ప్రకటించింది. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా రాయబారులు ప్రయత్నాలు ప్రారంభించిన తరుణంలో ఈ పునరుద్ధరణ చోటుచేసుకుంది. వచ్చే నెలలో అమెరికా, ఉక్రెయిన్‌లతో త్రైపాక్షిక భేటీలో



చర్చించేందుకు రష్యా పచ్చ జెండా ఊపింది. శుక్రవారం ఉక్రెయిన్‌లోని దక్షిణ ఖేర్సన్ ప్రాంతంలో యుద్ధంతో ధ్వంసమై రష్యా ఆక్రమిత పట్టణమైన ఒలేష్కీ చుట్టూ అమెరికా ప్రథమ మహిళ మెలానియా మధ్యవర్తిత్వంతో కుదిరిన స్థానిక కాల్పుల విరమణకు రష్యా, ఉక్రెయిన్‌లు అంగీకరించాయి.



# నేటి నిర్లక్ష్యం.. రేపటి సంక్షోభం!

## ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులు

**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడుగంటుతున్న భూగర్భ జలాలు**

**ఎండుతున్న పంటలు, పెరుగుతున్న నిత్యావసర ధరలు**

**ముందు జాగ్రత్తగా అన్నింటికీ పొదుపే పరిష్కారం!**

**ప్రకృతిలో చోటుచేసుకుంటున్న మార్పులు మానవాళికి పెను సవాలుగా మారుతున్నాయి. వాతావరణ అసమతుల్యత, వర్షాభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఒకదానితో ఒకటి ముడిపడి జీవన వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కే ఎల్‌నినో పరిస్థితులు భారత రుతుపవనాలపై ప్రభావం చూపుతున్నాయి. 2026 నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే 12.6 శాతం తక్కువ వర్షపాతం నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం వాతావరణ సమస్య కాదు.. ప్రజల జీవనోపాధి, ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంతో ముడిపడిన అంశం.**

హైదరాబాద్ : పసిఫిక్ మహాసముద్రంలో భూమధ్యరేఖ ప్రాంత జలాలు సాధారణం కంటే వేడెక్కడం, సముద్ర-వాతావరణ వ్యవస్థలో మార్పులు చోటుచేసుకోవడం ఎల్‌నినో ప్రధాన లక్షణం. దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల పంపిణీపై కనిపిస్తుంది. భారత్‌లో బలహీన రుతుపవనాలు, సుదీర్ఘ పొడి విరామాలు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి. అయితే ప్రతి ప్రాంతంలో వర్షాభావానికి ఎల్‌నినో ఒక్కటే కారణం కాదు. వర్షాలు తగ్గితే పంటల ఎదుగుదల దెబ్బతింటుంది, సాగునీటి అవసరం పెరుగుతుంది, భూగర్భ జలాల పునరుద్ధరణ మందగిస్తుంది, తాగునీటి సరఫరాపైనా ఒత్తిడి పెరుగుతుంది. బలహీన రుతుపవనాల ముప్పును ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం 315 జిల్లాలను గుర్తించి ముందస్తు ప్రణాళికలపై దృష్టి సారించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

### అడుగంటుతున్న జలాశయాలు.. పొదుపే మార్గం!

వర్షపాత లోటు ప్రభావం జలాశయాల నిల్వల్లో స్పష్టంగా కనిపిస్తోంది. 2026 సెప్టెంబర్ చివరి వారంలో దేశంలోని 178 ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు 70 శాతానికి చేరగా, దక్షిణ భారతంలోని ప్రధాన జలాశయాల్లో నిల్వలు సుమారు 50 శాతానికి పడిపోయాయి. అక్టోబర్ మూడో వారానికి వచ్చేసరికి దేశ సగటు 66.70% కి, దక్షిణాది నిల్వలు 42.34% కి పడిపోవడం ఆందోళనను మరింత పెంచింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల్లో తాగునీరు, సాగునీటి అవసరాలను సమన్వయం చేయడం ఇప్పుడు కీలకంగా మారింది. నీటి కొరత వచ్చాక ప్రత్యామ్నాయాల కోసం వెతకడం కంటే ముందుగానే పొదుపు చర్యలు చేపట్టాలి. ఆర్వో పరికరాల నుంచి వెలువడే నీటిని ఇతర అవసరాలకు మళ్లించాలి. కూరగాయలు కడిగిన నీటిని మొక్కలకు వినియోగించాలి. కుళాయిల లీకేజీలను అరికట్టాలి. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ, గ్రామాల్లో చెరువులు-కుంటల పునరుద్ధరణ, పొలాల్లో బిందు, తుంపర సేద్యం వంటి సమర్థ వినియోగ పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### విద్యుత్ డిమాండ్ పెరుగుదల.. అప్రమత్తత అవసరం!



ఎండల తీవ్రత పెరిగే కొద్దీ ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరుగుతుంది. వ్యవసాయంలో బోరుబావుల ద్వారా నీటిని తోడేందుకు అధిక విద్యుత్ అవసరమవుతుంది. జలాశయాల్లో నీరు తగ్గితే జలవిద్యుత్ ఉత్పత్తి కూడా ప్రభావితమవుతుంది. గత కొన్ని నెలలుగా దేశ విద్యుత్ డిమాండ్ బాగా పెరిగి 270.8 గిగావాట్లకు చేరి రికార్డు సృష్టించింది. ఏప్రిల్-జూన్ లో గత ఏడాదితో పోలిస్తే చాలా రెట్లు డిమాండ్ పెరిగింది. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో బొగ్గు విద్యుత్ పైనే భారం పడింది. ఏసీలను 24-26 డిగ్రీల వద్ద ఉంచడం, అవసరం లేని లైట్లు-ఫ్యాన్లు ఆపేయడం, ఎల్‌ఈడీ బల్బులు, అధిక స్టార్ రేటింగ్ పరికరాలు వాడటం, పగటిపూట సహజ వెలుతురును వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ ఆదా చేయవచ్చు.

### ఆహార వృథా.. రైతు శ్రమకు అవమానం!

వర్షాభావం వ్యవసాయాన్ని దెబ్బతీస్తే పంటల దిగుబడులు, సరఫరా వ్యవస్థలు ప్రభావితమై నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు, వేడుకల్లో ఆహారాన్ని వృథా చేయడం బాధ్యతారాహిత్యమే. ఒకవైపు పేద కుటుంబాలు పౌష్టికాహారం కోసం ఇబ్బంది పడుతుంటే, మరోవైపు విందుల్లో తినగలిగిన దానికంటే ఎక్కువ వడ్డించుకుని పారబోయడం విచారకరం. వేడుకల్లో అతిథుల సంఖ్యను అంచనా వేసి సరిపడా వంటకాలు సిద్ధం చేయాలి. కావాల్సినంత మాత్రమే తీసుకునే అలవాటును ప్రోత్సహించాలి. మిగిలిన సురక్షిత ఆహారాన్ని ఆహార భద్రతా ప్రమాణాలు పాటిస్తూ అవసరార్థులకు అందించాలి.

### తీవ్రమైన సంక్షోభం రాకముందే ముందు జాగ్రత్త అవసరం!

వాతావరణ మార్పుల ప్రభావాన్ని పూర్తిగా నివారించడం మన చేతుల్లో లేకపోయినా, నష్టాలను తగ్గించుకోవడం సాధ్యమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, విద్యుత్ అవసరాలు, వ్యవసాయ ప్రణాళికలపై సమన్వయంతో ముందుకు సాగాలి. ప్రజలు ప్రభుత్వాలపైనే ఆధారపడకుండా తమ వంతు బాధ్యతను గుర్తించాలి. ఇంట్లో నీటి పొదుపు, కార్యాలయంలో విద్యుత్ ఆదా, వేడుకల్లో ఆహార వృథా నివారణను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి.

ఎల్‌నినో మనకు ప్రకృతి ఇస్తున్న హెచ్చరిక మాత్రమే కాదు, మన జీవన విధానాన్ని సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్న పరిణామం. నీటిని పొదుపు చేయడం అంటే భవిష్యత్తును కాపాడటం.. విద్యుత్ ను ఆదా చేయడం అంటే వనరులను సంరక్షించడం.. ఆహారాన్ని గౌరవించడం అంటే రైతు శ్రమకు విలువనివ్వడం. ప్రకృతిని నిందించడం కాదు, మన అలవాట్లను మార్చుకోవడమే అసలైన పరిష్కారం.

– జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు

# సెన్సార్ బోర్డులో 500కుపైగా సినిమాల డేటా లీక్..

### కొన్ని స్క్రిప్టులూ బహిర్గతం!




సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్‌లో భారీ డేటా లీక్ జరిగింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెలువడుతున్నాయి. ఈ డేటా లీక్‌లో సీబీఎఫ్‌సీ ఫీచర్ ఫిల్మ్‌లతో సహా 500కు పైగా చిత్రాల ధ్రువీకరణ రికార్డులు బహిర్గతమయ్యాయి. వీటిలో సినిమాలను థియేటర్లలో విడుదల చేయడానికి అనుమతి పొందడం కోసం చిత్రనిర్మాతలు సమర్పించిన స్క్రిప్టులు, కట్ ఆర్డర్లు, ఇతర పత్రాలు కూడా ఉండడం గమనార్హం. జదీఖీజ తన ధ్రువీకరణ పనిని డిజిటలైజ్ చేయడానికి.. దశాబ్దం క్రితం ఇ-సినీప్రమాణ్ అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించింది. చిత్రనిర్మాతలు సినిమా ధ్రువీకరణల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఈ పోర్టల్ ద్వారా పత్రాలను సమర్పిస్తారు. ప్రస్తుతం ఈ ఇ-సినీప్రమాణ్ పోర్టల్ నుంచే కీలక డేటా లీకైంది. ఆన్‌లైన్ కంటెంట్‌ను భద్రపరిచే లాభాపేక్షలేని డిజిటల్ లైబ్రరీ అయిన ఇంటర్నెట్ ఆర్కైవ్ ద్వారా ఈ రికార్డులు డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో వచ్చాయి. ఈ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత ఆ మెటీరియల్‌ను తొలగించి నట్లు 'ఇంటర్నెట్ ఆర్కైవ్' వెల్లడించింది. సైబర్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఈ డేటా లీక్‌పై దర్యాప్తు చేస్తున్నామ ని.. పోర్టల్‌పై భద్రతా ఆడిట్ నిర్వహిస్తున్నా మని సీబీఎఫ్‌సీ తెలిపిం ది. అనధికారిక యాక్సెస్ ఆరోపణలకు సంబంధించిన సమాచా రాన్ని సమీక్షించామంది. అయితే బహిర్గతమైన పత్రాలను ఇతరులు యాక్సెస్ చేసినట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేసింది. ఏ ఒక్క చిత్రనిర్మాత ఖాతా కూడా హ్యాక్ అయినట్లు కనిపిం చట్లేదంది. దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామంది.



# అత్యుత్తమ అవకాశం కోసం వేచి చూడటం దండగ

### తమన్నా భాటియా

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా ఒకవైపు వరుస సినిమాలు, మరోవైపు ఓటీటీ వెబ్ సిరీస్‌లు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అంతేకాకుండా పాపులర్ స్పెషల్ సాంగ్స్‌తో గ్లామర్ డాల్‌గా దూసుకుపోతున్న ఈ భామ, భాషతో సంబంధం లేకుండా చేతికి వచ్చిన ప్రతీ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో, తాజాగా.. పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తమన్నా చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ భూమ్మీద అత్యుత్తమ అవకాశం కోసం వేచి చూడటం అనేది అతిపెద్ద అబద్ధమని తమన్నా అన్నారు. తాను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలోనే గొప్ప నటినో, అద్భుతమైన డ్యాన్సర్‌నో లేదా బిజినెస్ ఉమెన్‌నో కాదని స్పష్టం చేశారు. ప్రతీది ఇండస్ట్రీకి వచ్చాకే అనుభవపూర్వకంగా నేర్చుకున్నానని చెప్పారు. ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవడానికి ఉన్న ఏకైక ఉత్తమ మార్గం.. దాన్ని ఆచరణలో దిగి చేసి చూపించడమేనని ఆమె వ్యాఖ్యానించారు. మన జీవితంలో చేసే ప్రతీ పని ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పుతుందని, అదే మనల్ని కెరీర్‌లో మరో స్థాయికి తీసుకువెళుతుందని తమన్నా వివరించారు. సరైన అవకాశం కోసం ఖాళీగా కూర్చోకుండా వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ ముందుకు సాగడమే విజయానికి అసలైన రహస్యమని తమన్నా స్పష్టం చేశారు.

# ఇదొక అద్భుతమైన అనుభవం..



టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో ఫుల్ బిజీగా ఉన్న ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి త్వరలోనే 'వృషకర్మ' చిత్రంతో సందడి చేయబోతున్నారు. అక్కినేని నాగచైతన్య హీరోగా, కార్తీక్ దండు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ మైథాలాజికల్ థ్రిల్లర్‌ను బివిఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మూవీ టీమ్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన భారీ గుహ సెట్‌ను సందర్శించిన మీడియాతో హీరోయిన్ మీనాక్షి సరదాగా ముచ్చటించారు. "ఇదొక అద్భుతమైన అనుభవం. మీరు ఇంతకు ముందు ఇలాంటిది ఎప్పుడూ చూసి ఉండరు. ఎవరూ చూడని విధంగా కొత్త ప్రపంచాన్ని ఈ సినిమా కోసం సృష్టించారు. ఇందులోని అందమైన విషయం ఏమిటంటే, దర్శకుడు పాత్రలకు ప్రాధాన్యతనిస్తూ కథ రాశారు. ఆ పాత్రలో ఏమి జరుగుతుందో మనకు తెలియదు. అక్షరాలా నిజ జీవిత అనుభూతిని కలిగించగలిగారు. నిజ జీవితంలో నేను ఒక గుహలోకి ఎప్పుడూ ప్రవేశించలేదు. కానీ ఈ సినిమా ద్వారా ఆ అనుభూతిని పొందాను. ఈ సినిమాకి ప్రత్యేక శైలి, ప్రత్యేకమైన తీరు ఉన్నాయి. ఇందులో భాగం అయినందుకు నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఇది నా కెరీర్‌లో చాలా ముఖ్యమైన చిత్రం. ఇదొక గొప్ప అనుభవంగా భావిస్తున్నా" అని చెప్పుకొచ్చారు.




# సంస్కృతిని ప్లేట్లలో వెతక్కండి..

### 'ఇడుపు కాయితం' ట్రోల్స్‌పై వేణు ఊడుగుల

ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వంలో రూపొందుతున్న ఫ్యామిలీ డ్రామా 'ఇడుపు కాయితం'. బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. డిసెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల మూవీ నుంచి విడుదలైన ఓ పాటలోని కొన్ని సన్నివేశాలు ట్రోల్స్‌కు దారితీశాయి. తాజాగా ఆ ట్రోల్స్, నెగెటివ్ కామెంట్లపై దర్శకుడు వేణు ఊడుగుల స్పందించారు. తెలంగాణ సంస్కృతిని తప్పుగా అర్థం చేసుకుంటున్న వారిపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. "సంస్కృతిని ప్లేట్లలో, గ్లాసుల్లో వెతక్కండి. ఆ ప్రాంతం చరిత్రలో, అక్కడి ప్రజల శ్రమలో, కళల్లో, వారు చేసిన పోరాటాల్లో వెతకండి. కేవలం ఒక సన్నివేశాన్ని, ఆహారపు అలవాట్లను చూసి అంచనా వేయడం సరికాదు. తెలంగాణ సంస్కృతిని నిజంగా అర్థం చేసుకోవడానికి కనీస సంస్కారం, ఆ ప్రాంతంపై లోతైన అవగాహన కావాలి" ఆయన అభిప్రాయపడ్డారు. సరైన అవగాహన లేకుండా సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు విమర్శలు చేయడం మానుకోవాలని పరోక్షంగా హెచ్చరిం చారు. నిజ జీవితాలను, మట్టి వాసనను తెరపైకి తెచ్చే ప్రయోగాత్మక చిత్రాలను ప్రోత్సహించాలని వేణు కోరారు. "మన జీవితాల్ని, సంస్కృతుల్ని తెరమీదకు తీసుకొచ్చే 'ఇడుపు కాయితం' లాంటి సినిమాలను అందరం ఆదరిద్దాం. సినిమా రిలీజ్ అయ్యాక మీకు నచ్చకపోతే అప్పుడు విమర్శిం చండి. దాన్ని ఎవరూ కాదనరు. అంతేకానీ, ఒక ప్రాంతం అలవాట్లను మీ అజ్ఞానంతో విమర్శించకండి. ఇలాంటి సినిమాలకు మద్దతుగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది" అని ఆయన రాసుకొచ్చారు.

# 'జైలర్ 2'కు వసూళ్ల వర్షం

### త్వరలో రెండు రికార్డులు బద్దలు

సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఇందులో టైగర్ ముత్తువేల్ పాండియన్‌గా రజనీ మరోసారి తన అభినయంతో అదరగొట్టారు. 'జైలర్'కు సీక్వెల్‌గా నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రం 10 రోజుల్లో రూ.666 కోట్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్ నటించిన '2.ఓ' ఇప్పటివరకూ అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రంగా (రూ.691 కోట్లు) ఉంది. 'జైలర్ 2' మరో రూ.25 కోట్లు సాధిస్తే, '2.ఓ' రికార్డును అధిగమించినట్లే. విజయ్ నటించిన 'లియో' రూ.605.9 కోట్లతో ఈ జాబితాలో మూడో స్థానంలో ఉంది. 2023లో వచ్చిన 'జైలర్' రూ.604.7 కోట్లు వసూలు చేసింది. మరోవైపు కేరళలో 'బాహుబలి 2' రికార్డును బద్దలుకొట్టే దిశగా 'జైలర్ 2' దూసుకెళ్తోంది. కేరళలో సుమారు రూ.70 కోట్లు సాధించడం ద్వారా ఆ రాష్ట్రంలో అత్యధిక వసూళ్లు చేసిన మలయాళేతర సినిమాగా 'బాహుబలి 2' నిలిచింది. త్వరలోనే 'జైలర్ 2' ఈ రికార్డును అధిగమించనున్నట్లు ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. 'జైలర్ 2'లో విలన్లుగా ఎస్.జె.సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, ప్రత్యేక పాత్రల్లో మోహన్‌లాల్, శివరాజ్ కుమార్, హృతిక్ రోషన్, జాకీ ష్రాఫ్, విజయ్ సేతుపతి ప్రేక్షకులను అలరించారు.



# 'రామాయణ' నుంచి మరో పాట వచ్చేసింది

రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకుడు. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ మొదటి పార్ట్ నవంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం మూవీ నుంచి 'రంగులు రంగులే' అనే పాటను విడుదల చేసింది. ఇందులో రాముడిగా రణ్‌వీర్ కపూర్, సీతగా సాయి పల్లవి ఆకట్టుకుంటున్నారు.



## యూట్యూబ్ ప్రీమియంతో ఎయిర్‌టెల్, జియో ప్లాన్స్




ప్రముఖ టెలికాం కంపెనీలైన ఎయిర్‌టెల్, జియో ఎంపిక చేసిన ప్లాన్లపై యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా అందిస్తున్నాయి. దీంతో యూట్యూబ్‌లో యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ పొందొచ్చు. యూట్యూబ్ ప్రీమియం కావాలంటే వేరేగా సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రత్యేకమైన వోచర్లను రీఛార్జ్ చేసుకుంటే.. యూట్యూబ్ ప్రీమియాన్ని ఉచితంగా పొందొచ్చు. రెండు కంపెనీలూ రూ.200 డేటా వోచర్‌పై ఈ ఆఫర్‌ను అందిస్తున్నాయి. 30+దీ హై స్పీడ్ డేటా, 28 రోజుల వ్యాలిడిటీతో వస్తున్నాయి. ఈ ఆఫర్‌ను పొందాలంటే కచ్చితంగా ప్రీపెయిడ్ రీఛార్జ్ కలిగి ఉండాలి. ఎయిర్‌టెల్‌లో రూ.200 డేటా వోచర్ ప్లాన్‌తో యూట్యూబ్ ప్రీమియంతో పాటు ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్, జీ5, సోనీలివ్ వంటి ఇతర 18కి పైగా ఓటీటీ ప్లాట్‌ఫాంల ఉచిత యాక్సెస్ లభిస్తుంది. జియో విషయానికొస్తే.. రూ.200 డేటా వోచర్‌తో యూట్యూబ్ ప్రీమియంతో పాటు జియో టీవీ మొబైల్ యాప్ ద్వారా ప్రైమ్ వీడియో, జియోహాట్‌స్టార్, సోనీలివ్, జీ5, సన్‌ఎన్‌ఎక్స్‌టీ, లయన్‌గేట్ ప్లే, డిస్కవరీం, ఈటీవీ విన్ వంటి ఓటీటీ ప్రయోజనాలు పొందొచ్చు. అదనంగా సినీపోలిస్ పై రూ.150 డిస్కౌంట్ అందిస్తోంది. రోజువారీ డేటా కలిగిన అర్హత గల ప్రీపెయిడ్ ప్లాన్‌లపై అన్‌లిమిటెడ్ 5+ డేటాను కూడా అందిస్తోంది.



# బిజినెస్



## వెండి ధర ఎందుకు తగ్గుతోంది?

బంగారం, వెండి ధరలు గత కొన్ని రోజులుగా విలువను కోల్పోతున్నాయి. ఇంధన ధరలు పెరుగుతుండడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, వడ్డీ రేట్ల పెంపు వంటివి ఈ రెండు లోహాలపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా వెండి గరిష్ఠాల నుంచి సగానికి పైగా పతనమై రూ.2 లక్షల దిగువకు చేరింది. వెండి ఈ ఏడాది జనవరిలో ఔన్సు 120 డాలర్లు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో దీని ధర అప్పట్లో రూ.4 లక్షలు దాటింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు వెండి 53 డాలర్లకు పడిపోయింది. దీంతో కిలో వెండి ధర రూ.1.9 లక్షలకు చేరింది. పశ్చిమాసియా సంక్షోభం, ముఖ్యంగా సౌదీ అరేబియాలో చోటుచేసుకుంటున్న ఇటీవలి పరిణామాల వల్ల చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ప్రస్తుతం 116 డాలర్లకు చేరుకుంది. దీంతో ద్రవ్యోల్బణ భయాలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం ముప్పు వల్ల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను దీర్ఘకాలం పాటు గరిష్ట స్థాయిలోనే ఉంచుతుందన్న అంచనాలు బలపడ్డాయి. దీనివల్ల అమెరికా డాలర్ బలపడి బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై ఒత్తిడి పడుతోంది. మరోవైపు బంగారంతో పోలిస్తే వెండిని పారిశ్రామిక అవసరాలకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే, ప్రపంచ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల వల్ల ఆర్థిక వృద్ధి మందగిస్తుందన్న ఆందోళనలు వెండికి పారిశ్రామిక డిమాండ్ తగ్గింది. దీంతో వెండి ధర పతనం అవుతోంది.



## వన్డే సిరీసూ భారత్‌దే

### రెండో మ్యాచ్‌లో జింబాబ్వేపై ఘనవిజయం

వదోదర : జింబాబ్వేతో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత జట్టు.. వన్డే సిరీస్‌లోనూ అదే ఫలితం దిశగా సాగుతోంది. ఒక మ్యాచ్ మిగిలుండగానే స్మృతి బృందం వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. ఆదివారం భారత్ 121 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. మొదట భారత్ 6 వికెట్లకు 328 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్మన్‌ప్రీత్ కౌర్ (126; 121 బంతుల్లో 15x4), దీప్తి శర్మ (106 నాటౌట్; 86 బంతుల్లో 15x4) సెంచరీలతో మెరిశారు. ప్రతీక రావల్ (61; 67 బంతుల్లో 4x4, 2x6) రాణించింది. వైష్ణవి శర్మ (4/39), దీప్తి శర్మ (3/32) విజృంభించడంతో ఛేదనలో జింబాబ్వే 48.5 ఓవర్లలో 207 పరుగులకే ఆలౌటైంది. ముపచిక్వా (49; 70 బంతుల్లో 9x4), తిరిపానో (46; 57 బంతుల్లో 7x4), బిలన్డ్ బిజా (34; 49 బంతుల్లో 4x4) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. సిరీస్‌లో చివరి వన్డే బుధవారం వదోదరలోనే జరుగుతుంది. ఛేదనలో స్పిన్నర్లు వైష్ణవి, దీప్తి ధాటికి జింబాబ్వే నిలవలేకపోయింది. ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుని ఓటమి చవిచూసింది. అయితే ఆరంభంలో ఆ జట్టు బాగానే ఆడింది. ముపచిక్వా, తిరిపానో నిలవడంతో 22.1 ఓవర్లకు 107/1తో జింబాబ్వే మెరుగ్గానే కనిపించింది. కొద్ది తేడాతో వీళ్లిద్దరూ ఔట్ కావడంతో ఆ జట్టుకు ఎదురు దెబ్బ తగిలింది. ముపచిక్వాను వైష్ణవి, తిరిపానోను సయాలి ఔట్ చేశారు. ఆ తర్వాత బిలన్డ్ బిజా, కెప్టెన్ ఎంకొమో (20) కొద్దిసేపు పోరాడారు. 37.3 ఓవర్లకు 154/3తో జింబాబ్వే మళ్లీ కోలుకుంది. బిజా, ఎంకొమో, మావుంగా (3) వికెట్లను ఖాతాలో వేసుకున్న వైష్ణవి.. జింబాబ్వే పతనాన్ని వేగవంతం చేసింది. ఆపై గ్వాంజురా (22) పోరాటం భారత గెలుపు అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది. భారత బౌలర్లలో వైష్ణవి, దీప్తితో పాటు సయాలి (1/33), జింతిమణి (1/34), శ్రీచరణి (1/37) రాణించారు. భారత ఇన్నింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ ఆటే హైలైట్. దాదాపు ఇన్నింగ్స్ ఆఖరిదాకా నిలిచిన ఈ జంట.. స్కోరును 300 దాటించింది. అయితే భారత ఇన్నింగ్స్ తడబాటుతో మొదలైంది. కెప్టెన్ స్మృతి మంధాన (0), షెఫాలి వర్మ (8) త్వరగా పెవిలియన్ చేరిపోయారు. స్మృతి తొలి ఓవర్లోనే ఔటైపోగా.. షెఫాలి మూడో ఓవర్లో వెనుదిరిగింది. ఈ రెండు వికెట్లను సిబాంద ఖాతాలో వేసుకుంది. ఈ స్థితిలో హర్మన్‌ప్రీత్‌తో పాటు ప్రతీక రావల్ నిలిచింది. సిబాంద వేసిన అయిదో ఓవర్లో రెండు ఫోర్లు బాదిన హర్మన్.. తర్వాతి ఓవర్ (మకుషా)లోనూ రెండు బంతులను బౌండరీకి తరలించింది. మరోవైపు ప్రతీక కూడా మకుషా వేసిన 9వ ఓవర్లో సిక్స్‌తో జోరందుకుంది. దీంతో భారత్ 16 ఓవర్లకు 104/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. ఈ క్రమంలో ప్రతీక 57 బంతుల్లో, హర్మన్ 51 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. గ్వాంజురా వేసిన 23వ ఓవర్లో ఓ భారీ షాట్‌కు వెళ్లి, ప్రతీక ఔట్ కావడంతో 124 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాతి ఓవర్లోనే తేజల్ (3) వెనుదిరిగినా.. హర్మన్‌ప్రీత్‌తో కలిసి దీప్తి ఇన్నింగ్స్‌ను నడిపించింది. ధాటిగా ఆడిన దీప్తి.. ఒలిండర్ (30వ) బౌలింగ్‌లో రెండు ఫోర్లు, గ్వాంజురా (33వ) బౌలింగ్‌లో మరో రెండు ఫోర్లు అందుకుంది. ఈ క్రమంలోనే ఆమె 37 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించింది. మరోవైపు స్థిరంగా ఆడుతూ 90ల్లోకి వచ్చిన హర్మన్.. 101 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకుంది. భారత్ 41 ఓవర్లకు 261/4తో భారీ స్కోరుపై కన్నేసింది. స్లాగ్ ఓవర్లలో దీప్తి, హర్మన్ షాట్లకు దిగడంతో స్కోరు బోర్డు పరుగులెత్తింది. ఈ క్రమంలో హర్మన్ ఔటైనా.. జోరు కొనసాగించిన దీప్తి.. 83 బంతుల్లోనే శతకాన్ని సాధించింది. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో దీప్తి రెండు ఫోర్లు కొట్టడంతో భారత్ 325పైన స్కోరు చేయగలిగింది.

# మాటిచ్చా.. గెలిపించా

### తిలక్‌వర్మ




న్యూజిలాండ్‌తో రెండో టీ20లో టీమ్ ఇండియా కష్టాల్లో పడిన సమయంలో జట్టు ఎలాగైన గెలిపించాలన్న లక్ష్యంతో తిలక్ వర్మ బరిలోకి దిగాడు. ఈ విషయాన్ని నితీశ్ రెడ్డితో కలిసి బీసీసీఐ టీవీతో మాట్లాడుతు ఆయనే వెల్లడించారు. పిచ్ సహకరించక పోవడంతో తొలి టీ20 వలే భారీ సిక్సర్లు సాధ్యం కాకపోవచ్చని తనకు వెంటనే అర్థమైపోయిందన్నాడు. "వికెట్ సవాళ్లు విసురుతోందని అర్థమైపోయింది. ముఖ్యంగా మైదానం కూడా పెద్దది. మరోవైప్ స్లోపిచ్. కానీ, బౌన్సర్లు మాత్రం వేగంగా మీదకు వస్తున్నాయి. దీంతో అనుకున్నప్పుడల్లా సిక్సర్లు కొట్టడం సాధ్యం కాదని తేలిపోయింది. నిజాయతీగా చెబుతున్నాను.. తొలి మ్యాచ్‌లో చాలా సులభంగా సిక్సర్లు బాదాము. కానీ, ఈ పిచ్‌పై మా ఫిట్‌నెస్ స్థాయి ఏమిటో చూపించాలని నిర్ణయించుకొన్నాం. సింగల్స్, డబుల్స్‌తో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాలని భావించాము. నమన్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో భారీ షాట్లకు యత్నించాలని భావించాను. కానీ, మనసులో మాత్రం మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళతానని గౌతమ్ సర్, కొటక్ సర్‌కు మాటిచ్చాను" అని తిలక్ వర్మ పేర్కొన్నాడు. వాస్తవానికి 11వ ఓవర్ చివరికి నమన్, తిలక్ చెరో పరుగుతో క్రీజులో ఉన్నారు. కానీ, మూడు ఓవర్ల తర్వాత నమన్ 30 పరుగులు, తిలక్ ఆరు పరుగులకు చేరుకొన్నారు. ఆ తర్వాత తిలక్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో భారత్‌కు విజయం అందించాడు.




## 5 కంపెనీలు.. 2600 కోట్లు..

### ఈ వారం ఐపీఓలు ఇవే

గత వారమంతా జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓదే హవా. ఈ వారం కూడా ప్రైమరీ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. ఐదు కంపెనీలు దాదాపు రూ.2,600 కోట్ల నిధులను మార్కెట్ నుంచి సమీకరించనున్నాయి. ఇందులో ఈఏఏఏ ఇండియా అల్ట్రార్నేటివ్స్, ఎస్ఎస్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ వంటి కంపెనీలు ఉన్నాయి. ఐపీఓ నిధులను కార్పొరేట్ అవసరాలకు, రుణాల చెల్లింపులకు కంపెనీలు వినియోగించనున్నాయి. ఎడెల్వీస్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన ఈఏఏఏ ఇండియా ఆల్టర్నేటివ్స్ రూ.1200 కోట్ల నిధుల సమీకరణతో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబర్ 26న సబ్‌స్క్రిప్షన్ మొదలై.. అక్టోబర్ 28న ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.1,585-1,665గా కంపెనీ నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయిస్తున్నారు. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ ఇప్పటికే రూ.360 కోట్ల నిధులను సమీకరించింది. వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ రూ.668 కోట్ల నిధుల సమీకరణతో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబర్ 27న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. అక్టోబర్ 29న ముగియనుంది. ధరల శ్రేణి రూ.313-330గా కంపెనీ నిర్ణయించింది. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద కంపెనీ మార్కెట్ విలువ రూ.3,233 కోట్లు. రూ.150 కోట్ల విలువైన తాజా షేర్లు, 1.57 కోట్ల ఆఫర్ ఫర్ సేల్‌లో విక్రయించనున్నారు. ఎంకే సన్స్ ఫైన్ జువెల్స్ లిమిటెడ్ రూ.275.4 కోట్ల నిధుల సమీకరణతో అక్టోబర్ 28న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబర్ 30న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.153-162గా కంపెనీ నిర్ణయించింది. 1.36 కోట్ల తాజా షేర్లు, 34 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయించనున్నారు. బీఎల్ఎస్ పాలీమర్స్ లిమిటెడ్ రూ.255 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంలో ఐపీఓకు రానుంది. అక్టోబర్ 27న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. అక్టోబర్ 29న ముగియనుంది. ధరల శ్రేణి రూ.142-150గా కంపెనీ నిర్ణయించింది. 1.7 కోట్ల తాజా షేర్లు ఉన్నాయి. బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్ లిమిటెడ్ రూ.183.1 కోట్ల ఐపీఓతో అక్టోబర్ 29న సబ్‌స్క్రిప్షన్‌కు వస్తుంది. నవంబర్ 2న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ధరల శ్రేణి రూ.78-82. ఈక్విటీ షేర్లను పూర్తిగా తాజా షేర్ల రూపంలో విక్రయిస్తున్నారు.ఎఫ్‌పీఐల విక్రయాలు.. అక్టోబర్‌లో 48,056 కోట్ల నిధులు వెనక్కి రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ (జేపీఎల్) షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అక్టోబర్ 28న లిస్టింగ్ కానున్నాయి.

## ఆన్‌సి యాంగ్ చేతిలో సింధు ఓటమి

### ఫ్రెంచ్ ఓపెన్లో రన్నరప్ ట్రోఫీతో సరి




పారిస్: ఆన్ సి యాంగ్.. ఈ కొరియా అమ్మాయితో ఆడిన గత పది మ్యాచ్‌ల్లో భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు గెలవలేదు. ఆదివారం కూడా అదే ఫలితం పునరావృతమైంది. మరోసారి ఆన్ సి యాంగ్ చేతిలో సింధు ఓడిపోయింది. ఈసారి ఆమె తలొంచింది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో! ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తుది పోరులో సింధు 21-16, 11-21, 12-21తో ఒలింపిక్ ఛాంపియన్ ఆన్ సె యాంగ్ చేతిలో ఓడింది. తొలి గేమ్ గెలిచి జోరు మీద కనిపించిన సింధు.. అక్కడ నుంచి తడబడింది. తప్పిదాలు చేసి ప్రత్యర్థికి అవకాశం ఇచ్చింది. దీంతో రెండో గేమ్‌లో యాంగ్ 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సింధు కాస్త పుంజుకున్నా.. కొరియా అమ్మాయి మాత్రం పట్టువదల్లేదు. బలమైన క్రాస్‌కోర్టు షాట్లు, మెరుపు స్మాష్‌లతో పాయింట్లు రాబట్టిన ఆమె, 13-7తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరుతో గేమ్ గెలుచుకుని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణయాత్మక మూడో గేమ్ ఆరంభంలో సింధు-యాంగ్ నువ్వానేనా అన్నట్లు ఆడారు. ఒక దశలో స్కోరు 8-8గా మారింది. అక్కడ నుంచి సింధు అనవసర తప్పిదాలు చేసింది. దీంతో 13-9తో ఆధిక్యంలో నిలిచిన యాంగ్.. ఆ తర్వాత 18-10తో తిరుగులేని స్థితికి వెళ్లింది. ఆపై మ్యాచ్‌ను ముగించడానికి కొరియా స్టార్‌కు ఎంతో సమయం పట్టలేదు. ఈ సీజన్లో యాంగ్‌కు ఇది పదకొండో టైటిల్ కావడం విశేషం.

Printer, publisher and Owned by **NASKANTI LAXMINARAYANA**, Published from 2-596, Sainagar, old Hafeezpet, serlingamplly,,HYDERABAD, TELANGANA-500049. Printed from **NALIVELI EXPRESS**, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH-518380. Editor: **NASKANTI LAXMINARAYANA**, PRGI NO **TGTEL/25/A4524**. Ph no.**9492652230**. website : www.idenijamdaily.com.